RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 281 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 నవంబర్ 2024 శనివారం పేజీలు : 4

## పాంగాంగ్ వద్ద చైనా తవ్వకాలు

న్యూఢిల్లీ : తూర్పు లద్దాక్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద భారీ బంకర్లు నిర్మించేందుకు చైనా సైన్యం చాలా లోతుగా తవ్వుతున్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆయుధాలు, ఇంధనం నిల్వచేయడంతోపాటు, సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లుగానూ వీటిని ఉపయోగించుకోనున్నట్టు భావిస్తున్నారు. పాంగాంగ్ సరస్సు ఉత్తర దిక్కున పర్వతాల మధ్య సిర్జాప్ ప్రాంతంలో చైనా సైన్యం పీఎల్‌ఏ(ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) ప్రధాన స్థావరం ఉంది. పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించిన డ్రాగన్ సైన్యానికి అదే ప్రధాన కార్యాలయం. దానిని వాస్తవాధీన రేఖకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అది భారతదేశ భూభాగమని భారత్ వాదిస్తోంది.

# ఈ సారి మహిళల వంతు!

## రేవంత్ వదులుతున్న మరో బాణం.. గుడ్ న్యూస్‌కు రెడీ అవ్వండి!!

## మహాలక్ష్మి పథకం (2500) రేవంత్ సర్కార్ కసరత్తు!




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీపావళికి భారీ గిఫ్ట్‌ను వెల్లడించనున్నారని సమాచారం. ఈ మేరకు ఆయన ఆర్థిక శాఖ అధికారులతో కసరత్తులు చేస్తున్నారని తెలిసింది. వరసగా తమ ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు చేస్తుండటంతో పాటు కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇప్పుడు అమలు చేయడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆర్థిక పరమైన ఇబ్బందులున్నప్పటికీ విమర్శలు, ప్రభుత్వం ప్రజల నుంచి కొంత సానుకూల స్పందన కోరుకోవడంలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది. అది కూడా మహిళలను దృష్టిలో పెట్టుకుని ప్రకటన చేయనున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. మహాలక్ష్మి పథకం కింద...మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన మహిళలకు రెండు వేల ఐదు వందల రూపాయల పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకోసం కసరత్తులు ప్రారంభించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పేద మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రెండు వేల ఐదు వేల రూపాయలు మహాలక్ష్మి పథకాన్ని దీపావళి బహుమతిగా ఇవ్వనున్నారని చెబుతున్నారు. రైతు భరోసా నిధులను విడుదల చేయడం కంటే ముందుగానే మహిళలకు సంబంధించి ఈ పథకాన్ని అమలు చేయాలని రేవంత్ రెడ్డి నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. మహిళలు తమ ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, అందుకే వారికే ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ఆయన ఆలోచన చేస్తున్నారు. అర్హతలు ఉంటేనే రైతు భరోసా నిధులను కూడా రైతు రుణమాఫీ పూర్తి అయిన వెంటనే అమలు పర్చాలని నిర్ణయించారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఇప్పటికే కొందరికి అమలు చేశారు. ఇంకా పెండింగ్ లో ఉన్న రుణాలను ఈ డిసెంబరు నాటికి మాఫీ చేయనున్నారు. ఆ తర్వాత రైతు భరోసా నిధులను విడుదల చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే మహాలక్ష్మి పథకం కింద నెలకు రెండు వేల ఐదు వందల రూపాయలు తెల్ల రేషన్ కార్డులున్న మహిళలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే వర్తింప చేస్తారు.

ఇప్పటికే సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారికి కూడా రావు. దీనికి సంబంధించిన కసరత్తులు అధికారులు చేస్తున్నారు. కొత్తగా రేషన్ కార్డులు మంజూరయితే వారికి తర్వాత ఇవ్వొచ్చని, ముందు తెలుపు రంగు రేషన్ కార్డులున్న వారికి ఈ పథకాన్ని వర్తింప చేయాలని రేవంత్ అధికారులను ఆదేశించినట్లు చెబుతున్నారు. మరి రేవంత్ ఈ పథకాన్ని గ్రౌండ్ చేసే డేట్ మాత్రం బయటకు రాలేదు.




ఖమ్మం గుమ్మంలో గులాబీ కోటకు బీటలు పడుతున్నాయా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా జరుగుతున్న పరిణామాలే దానికి కారణంగా తెలుస్తోంది. తనకు అడ్డాగా ఉన్న ఖమ్మం నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. దూరం అవుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఒకటైమ్‌లో గులాబీ కంచుకోటగా ఉన్న స్థానం నుంచి పువ్వాడ దూరం కావడానికి కారణాలేంటి? ఆయన తర్వాత స్టెప్ ఏంటి? వాచ్ దిస్ స్టోరీ.. BRS హయాంలో మంత్రిగా ఓ వెలుగు వెలిగి.. ఖమ్మం జిల్లాను ఏకచత్రాధిపత్యంతో నడిపించిన నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో పార్టీలో సీనియర్లను సైలెంట్‌గా పక్కన పెట్టేసి.. తన హవాను కొనసాగించారనే వాదనలు ఉన్నాయి. పార్టీలో నెంబర్– 2 సీఎంగా చలామణి అయిన కేటీఆర్ అండదండలు పుష్కలంగా ఉండడంతో.. బ్రేక్ లేని కారులా.. జోరు పెంచుకుంటూ పోయారట. తన హయాంలో.. ఐదేళ్లు కాదు.. ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకునేలా తన మార్కు కనపడేలా అభివృద్ధి చేస్తానంటూ పెద్దపెద్ద స్టేట్‌మెంట్స్ ఇచ్చారు. నియోజకవర్గంతో పాటు జిల్లా ముఖాభివృద్ధిని కూడా మార్చేస్తానంటూ కంకణం గట్టుకున్నట్లు గొప్పగా చెప్పుకున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు దిమ్మ దిరిగే ఓటమి ఇవ్వటంతో ఏకంగా నియోజకవర్గాన్ని మార్చేస్తారనే వార్తలు గుప్పుమంటున్నాయి. గత ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు.. ఏకంగా 50 వేల మెజారిటీ సాధించారు. ఇదీ.. నియోజకవర్గంలో జనాలు ఇచ్చిన తీర్పు. దీంతో జిల్లా రాజకీయాల్లో పువ్వాడ సైలెంట్ అయిపోయారట. ఓటమి తరువాత సొంత నియోజకవర్గంలో పర్యటించిన దాఖలాలు కూడా లేవు. అయితే కొన్ని విషయాలు నియోజకవర్గంలో చక్కెట్లు కొడుతున్నాయి. తమకు కంచుకోటగా ఉన్న ఖమ్మంను వీడే ఆలోచనలో మాజీమంత్రి ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ నోటా.. ఈ నోటా ఆ మాట.. బయటకు రావటంతో ముఖ్య అనుచరులు కూడా ఈ అంశంపై చర్చించుకుంటున్నారట. ఖమ్మంను వీడితే.. పువ్వాడ అజయ్‌కు ఉన్న ఆప్షన్లు ఏంటనే చర్చ జోరుగా సాగుతోంది.

## తుమ్మల దెబ్బ.. ఖమ్మం నుండి పువ్వాడ జంప్!

ఏళ్లుగా తనకు కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో కాంగ్రెస్ అద్భుతమైన విధంగా పుంజుకోవటంతో ఏం చేయాలో తెలియని స్థితిలో పువ్వాడ ఉన్నారట. ఇప్పటికిప్పుడు కాకున్నా.. వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని రెండు నియోజకవర్గాల్లో ఆయన పోటీ చేస్తారనే టాక్ నడుస్తోంది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా కమ్మ సామాజిక వర్గం నేతలు ఓట్లు ఉండటంతో.. అక్కడైతే సునాయాసంగా బయటపడొచ్చనే భావనలో పువ్వాడ ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదే అంశంపై ఇటీవల.. కేసీఆర్‌తోనూ పువ్వాడ చర్చించారని తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ సిటీలో గులాబీ పార్టీ హవా కొనసాగించింది. అదే సమయంలో పువ్వాడ.. ఖమ్మం నుంచి కూకట్‌పల్లికి.. షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. వెంటనే గులాబీ అధినేత.. పువ్వాడను పిలిచి ఆరా తీసినట్లు వార్తలు నాడు గుప్పుమన్నాయి. దీంతో మాజీమంత్రి పువ్వాడ.. తాను ఖమ్మం నుంచి పోటీలో ఉంటానని చెప్పుకునే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఓడిన తర్వాత పువ్వాడ ముఖ్యఅనుచరుల వద్ద తన గోడును వెల్లబోసుకున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. ఒకవేళ.. కూకట్‌పల్లి లేదా శేరిలింగంపల్లిలో అయితే తాను తప్పకుండా అత్యధిక మెజారిటీతో గెలిచేవాడినని.. అందుకు కేసీఆర్ ఒప్పుకోలేదనే వారి వద్ద పువ్వాడ వాపోయారట. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ హవా పూర్తి స్థాయిలో ఉంది. భవిష్యత్‌లో కూడా హస్తం పార్టీకే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ నుంచి మరోసారి పోటీ చేసి ఓడిపోయేకంటే.. నియోజకవర్గాన్నే మార్చేయాలనే యోచనలో పువ్వాడ ఉన్నట్లు తెలుస్తోంది. ఖమ్మం నుంచి పూర్తిగా షిఫ్ట్ అయి హైదరాబాద్‌లోని.. ఆ రెండు స్థానాల్లో పట్టు సాధించుకునే విధంగా ఇప్పటికే ప్రయత్నాలు మొదలెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో BRSకు పట్టులేకుండా పోయింది. మిగతా జిల్లాలో సత్తా చాటుతున్నా..ఖమ్మంలో మాత్రం ఆశించిన ఫలితం కారుపార్టీకి దక్కలేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో కూడా ఖమ్మంలో ఉంటే గడ్డు పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని భావిస్తున్న ఆ పార్టీ నేతలు.. ఇతర పార్టీలోకి జంప్ కొట్టేస్తున్నారట. ఇందులో భాగంగానే మాజీమంత్రి పువ్వాడ.. ఖమ్మంకు గుడ్‌బై చెప్పనున్నారనే సమాచారం. BRSకు కాస్తో.. కూస్తో పట్టున్న గ్రేటర్ పరిధిలోనే తాను విజయం సాధించగలనని.. ఖమ్మంలో తమ వల్ల కాదనే మాజీమంత్రి.. తన అనుచరులతో వ్యాఖ్యానించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సెటిలర్ ఓటర్లు ఉంటే. దాంతో బయటపడి.. కనీసం సీటు దక్కుతుందనే భావనలో పువ్వాడ ఉన్నారట. గ్రేటర్ పరిధిలో అయితే.. కుల సామాజికపరంగా పువ్వాడకు మద్దతు దొరికే అవకాశం మెండుగానే ఉన్నట్లు రాజకీయ వర్గాలూ కూడా అంచనా వేస్తున్నాయి. తన మనస్సులో మాటను ఇప్పటికే పువ్వాడ.. కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చర్చ నడుస్తోంది. అందుకే ఖమ్మం పాలిటిక్స్‌లో చురుకుగా ఉండడం లేదనే వాదనలూ తెరపైకి వస్తున్నాయి. అయితే.. ఈ అంశంపై పువ్వాడ అజయ్ మాత్రం స్పందించలేదు. ఈ వార్తలను ఆయన ప్రధాన అనుచరుల్లో కొందరు ఖండిస్తున్నా.. కొందరు సమయం వచ్చినప్పుడు చెబుతామనే ధోరణిలో ఉన్నారట. ఏది ఏమైనా.. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం నుంచి పువ్వాడ దూరంగా ఉంటారని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో గులాబీబాస్ కేసీఆర్.. పువ్వాడను ఖమ్మంలో కొనసాగిస్తారా లేక రాజధానికి షిఫ్ట్ చేస్తారా.. అనేది ఉత్కంఠగా మారింది.




## బీజేఎల్పీ నేత సంచలన కామెంట్స్..

హైదరాబాద్, నవంబర్ 01: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ పార్టీ నేతలపై బీజేఎల్పీ నాయకుడు యేలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. 2025 జూన్ నుంచి డిసెంబర్‌లోగా తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారని జోస్యం చెప్పారు యేలేటీ. కేరళలో ప్రియాంక గాంధీ నామినేషన్ వేసేటప్పుడు వెళ్లినా.. రేవంత్‌ను రాహుల్ గాంధీ కలవలేదన్నారు. ఢిల్లీలో మూడుసార్లు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో.. ఖాళీగా తిరిగి వచ్చారన్నారు. దీనికి సంబంధించి పక్కా ఆధారాలు తన వద్ద ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. మూసీ అంశాన్ని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని బీజేఎల్పీ నేత వ్యాఖ్యానించారు.

ఇదే విషయాన్ని సదరు నేతలు ఎప్పటికప్పుడు అధిష్టానానికి చెప్తున్నారని పేర్కొన్నారు. నేరుగా కొంత మంది, మెయిళ్ల ద్వారా కొంతమంది, ఇతర మార్గాల ద్వారా మరికొంత మంది చేరవేస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని మంత్రులు, అధిష్టానం నమ్ముతుందని.. ఇది సాధారణ ప్రజల్లోకి సైతం చేరిందన్నారు.

సెలక్షన్, కలక్షన్, కరప్షన్ అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానమని కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆధారాలతో సహా వెళ్లినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు మహేశ్వర్ రెడ్డి.

## పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు...

# పాదయాత్ర చేస్తా

## జనాల్లో బీఆర్ఎస్ తరపున భరోసా కల్పిస్తా - కేటీఆర్

హైదరాబాద్: భారాస కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపమని అన్నారు. ప్రస్తుత పాలన ఫ్రం దిల్లీ, టూ దిల్లీ, ఫర్ దిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. హస్తం పార్టీ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రజలపక్షాన కొట్లాడటమే ప్రస్తుతం తమముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. “పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి పాదయాత్ర నిర్వహిస్తా. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకీ మార్గదర్శనం చేస్తున్నారు. పార్టీ నేతలపై వేధింపులు, అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా సోషల్ మీడియా వారియర్లు అద్భుతంగా పని చేస్తున్నారు” అని కేటీఆర్ తెలిపారు.

**దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచింది...** కాంగ్రెస్ దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పంట కొనుగోళ్లపై ‘ఎక్స్’ వేదికగా ఆయన స్పందించారు. వానాకాలం వరి కోతలు సాగుతున్నప్పటికీ.. రైతుబంధు, రైతుభరోసా ఊసే లేదని ఆక్షేపించారు.



కనీసం పంట కొనుగోలు చేయడం లేదని.. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. ఈ సీజన్లో 91 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి.. అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. ‘రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో చూడండి’ అని వ్యాఖ్యానించారు. దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం లేదని.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మిల్లుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ విమర్శించారు.

సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు ప్రక్రియ నిలిచిందన్నారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్‌లో బిజిబిజీగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## సంపాదకీయం

# ఫ్రీ బస్సు : కర్ణాటక పిల్లిమొగ్గలు... ఏపీ సంగతేంటి ?

మహిళలకు ఉచిత బస్సు సదుపాయం అన్నది అందమైన నినాదం. ఎన్నికల్లో ఓట్లు రాల్చే బ్రహ్మాండమైన పథకం. అయితే అది ఆచరణలోకి వచ్చేసరికి సర్కార్ బండికి ఎన్ని బ్రేకులు వేయాలో అన్నీ వేస్తోంది. ఖజానాకు భారంగా మారుతోంది. కర్ణాటకలో మొదట ఈ పథకాన్ని ప్రారంభించారు. దక్షిణాదిన కాంగ్రెస్ కర్ణాటక నుంచి తన విజయయాత్రను ప్రారంభించింది. ఈ క్రమంలో బీజేపీ చేతులలో ఉన్న కర్ణాటకను గెలుచుకోవడానికి ఉచిత బస్సు పథకాన్ని కాంగ్రెస్ బ్రహ్మాస్త్రంగా ప్రయోగించింది. అది సూపర్ హిట్ అయి రాష్ట్రం స్టీరింగ్ నే కాంగ్రెస్ కి అప్పగించింది. ఆ తరువాత తెలంగాణాలో కూడా కాంగ్రెస్ ఉచిత బస్సు అంటూ అవే పథకాన్ని ప్రయోగిస్తే అక్కడ కూడా బంపర్ హిట్ అయింది. ఇక ఆ రెండింటినీ చూసి ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఉచిత బస్సు హామీని ప్రకటించారు. చిత్రంగా కూటమికి కూడా ఈ హామీ ఓట్లూ సీట్లు అధికారం తెచ్చిపెట్టింది. ఇపుడు చూస్తే మొదట హామీ ఇచ్చిన కర్ణాటక ఫ్రీ బస్సు స్కీం విషయంలో కిందా మీద అవుతోంది. దీని మీద గతంలోనే ఎన్నో సార్లు చర్చలు జరిగాయని ప్రచారం ఉంది. ఉచిత బస్సుని కూని రూటలే పరిమితం చేయాలని ప్రతిపాదించారు అని అన్నారు. అంతే కాదు కొన్ని బస్సులలో మాత్రమే ఫ్రీ బస్సు స్కీం ని వర్తింపచేయాలని చూస్తున్నారు అని ప్రచారం సాగింది. ఇపుడు చూస్తే డిప్యూటీ సీఎం శివకుమార్ అయితే ఫ్రీ బస్సు స్కీం నే ఎత్తివేయాలని ఆలోచిస్తున్నారని ప్రచారం సాగింది. దీని మీద పునరాలోచన చేయాలను చూస్తున్నట్లుగా కూడా వార్తలు వచ్చాయి. మహిళలు డబ్బులు ఇచ్చి బస్సులలో ప్రయాణం చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు అని ఆయన అన్నట్లుగా చెప్పుకున్నారు. ఈ మెయిల్స్ ద్వారా సోషల్ మీడియా ద్వారా మహిళలు ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియచేస్తున్నారు అని అన్నారు. అయితే లేటెస్ట్ గా డీకే శివకుమార్ అలాంటిది ఏదీ లేదని అంటున్నారు. ఫ్రీ బస్సు స్కీం ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అయితే అసలు విషయం ఏంటి అంటే అక్కడ ఖజానాకు ఇబ్బందులు వస్తున్నాయి. సూపర్ ఫైవ్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన పథకాలను అమలు చేయలేక సతమతం అవుతున్న నేపథ్యం ఉంది. అందుకే కర్ణాటక కాంగ్రెస్ ఫ్రీ బస్సు విషయంలో పిల్లి మొగ్గలు వేస్తోంది అని అంటున్నారు. మరి తెలంగాణాలో కూడా ఈ పథకం భారంగానే ఉంది అని అంటున్నారు. ఏపీలో అయితే ఆ రెండు స్టేట్స్ తో పోలిస్తే ఖజానా కుదేల్ అయిన నేపథ్యం ఉంది. లక్షల కోట్ల అప్పులతో ఉంది. ఈ క్రమంలో చూస్తే కనుక ఏపీలో ఇంకా ఈ పథకం ప్రారంభం అవనేలేదు. దాని మీద తర్జన భర్జన పడుతున్నారు. ఫ్రీ బస్సు పథకాన్ని స్టడీ చేసేందుకు కూటమి ప్రభుత్వం కర్ణాటకను తెలంగాణాను ఎంచుకుంది. మరి అక్కడే ఫ్రీ బస్సు స్కీం మీద అనేక రకాలుగా ఆలోచనలు సాగుతున్న వేళ కూటమి ప్రభుత్వం దీని మీద ఏ రకంగా నిర్ణయం తీసుకుంటుంది అన్నది చూడాలి. ఈ పథకానికి నెలకు రెండు వందల యాభై కోట్లు ఆర్టీసీకి భారం అవుతుంది. అంటే ఏడాదికి మూడు వేల కోట్లు అన్న మాట. ఆర్టీసీ ప్రభుత్వంలోనే ఉంది. ఈ భారం అంతా సర్కార్ దే అవుతుంది. ఈ నెల 6న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉచిత బస్సు మీద కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు

# నకిలీ సందేశం.. నమ్మితే ఖాతా ఖాళీ



హైదరాబాద్: జనం డబ్బు కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళు మరో కొత్త మోసంతో ముందుకొస్తున్నారు. బ్యాంకు తరహాలో డబ్బు జమ చేసినట్లు డమ్మీ సందేశాలు పంపిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. అత్యసర పరిస్థితుల్లో ఉన్నామని తమ బ్యాంకు ఖాతా, చరవాణి పని చేయడంలేదని డబ్బు పంపాలంటూ మోసం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఈ తరహాలో మోసాలు పెరుగుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు.

**సహోద్యోగినని నమ్మించి..**

శేరిలింగంపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేసి సహోద్యోగినని చెప్పి తన వాళ్లు ఆసుపత్రిలో ఉన్నారని పరిచయం చేసుకున్నాడు. చరవాణి సాంకేతిక సమస్యతో ఆసుపత్రి బిల్లు చెల్లించడం ఇబ్బందవుతోందని, కొంత డబ్బు కావాలని అడిగాడు. బదులుగా తన మిత్రుడు ఫోన్‌పే, గూగుల్‌పేకి డబ్బు పంపిస్తాడని చెప్పి 9 విడతల్లో రూ.3.74 లక్షలు బదిలీ చేయించాడు. డబ్బు ఖాతాలో జమైనట్లు సందేశాలు రావడంతో ప్రైవేటు ఉద్యోగి నిజమేనని నమ్మి రూ.3.74 లక్షలు తిరిగి పంపాడు. మరుసటిరోజు బ్యాంకు ఖాతాను తనిఖీ చేయగా రూ.3.74 లక్షలు జమవ్వలేదు. ఇదేంటని ఆరా తీయగా సందేశాలు నకిలీవని అవతలి వ్యక్తి మోసం చేసినట్లు తేలింది.

**వ్యక్తిగత డేటా అంగట్లో సరకులా మారడంతోనే..**

సైబర్ నేరగాళ్లు పేరు, సంస్థ పేరు చెప్పి మోసగించడానికి ప్రధాన కారణం వ్యక్తిగత డేటా అంగట్లో సరకులా మారడమే. ప్రైవేటు కంపెనీలు, ఇతర సంస్థల ఉద్యోగుల డేటా లీకవ్వడం ఒకెత్తయితే.. ఏ కంపెనీలో ఏ హోదాలో ఎప్పటి నుంచి పనిచేస్తున్నామో వ్యక్తిగత వివరాలు సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడమూ సమస్యగా మారుతోంది. వీటిని ఆధారంగా చేసుకుని నేరగాళ్లు తెలిగ్గా మోసగిస్తున్నారు. సామాజిక మాధ్యమ ఖాతాలోని వివరాలతో మోసాలు జరగానికి అదే కారణమని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..**

చిన్ననాటి స్నేహితులమని, బంధువులు, సహోద్యోగి పేర్లతో డబ్బులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో పంపొద్దు.

పరిచయం లేని వ్యక్తులు డబ్బులు అడిగితే మోసమని గుర్తుంచుకోవాలి. సాధారణంగా బ్యాంకులు ఒక నిర్దిష్ట విధానంలోనే ఖాతాదారులకు సందేశాలు పంపిస్తాయి. వ్యక్తిగత, నాలుగైదు అంకెలుండే నంబర్లతో పంపవు. మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీకి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

# అక్రమ కట్టడాల తొలగింపునకు అధునాతన యంత్రాలు.. టెండర్లు ఆహ్వానించిన హైడ్రా



హైదరాబాద్: ఇప్పటివరకు హైడ్రా చేపట్టిన కూల్చివేతల్లో ఆరంతస్తుల భవనమే ఎత్తైనది. త్వరలో 20నుంచి 30 అంతస్తుల్లోని అక్రమ కట్టడాలు హైడ్రా లక్ష్యం కానున్నాయి. వాటిని నేలమట్టం చేయగల యంత్రాలు సమకూర్చుకునేందుకు టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు.

అనుభవం తప్పనిసరిపిల్లర్లను తుంచేసే ఓ జా క్రషర్, రెండు షీర్ కట్టర్లు, బండరాళ్లను పగులగొట్టే పరికరంతో 20మీటర్ల పొడవైన హైడ్రాలిక్ బూమ్ కలిగిన ఓ బుల్డోజరు అవసరమని కొటేషన్లు ఆహ్వానించింది. 5గంటల్లో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఐదంతస్తుల భవనాన్ని కూల్చిన అనుభవం తప్పనిసరి అని నిబంధన పెట్టింది.

వ్యర్థాల తొలగింపునకూ..

ఇప్పటివరకు 26 ప్రాంతాల్లో 300లకుపైగా నిర్మాణాలను హైడ్రా కూల్చింది. ఆ నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు తాజాగా టెండర్లు ఆహ్వానించింది. వ్యర్థాలను తొలగించి, చెరువుల్లో పూడిక మట్టిని కూడా వెలికితీయాలని నిర్ణయించింది. శేరిలింగంపల్లిలోని నాలుగు చెరువులను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు టెండర్లు పిలిచామని అధికారులు చెబుతున్నారు.

అడ్డంకులు ఉండొద్దనే నిర్ణయం

"కొందరు ప్రముఖులు చెరువులు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టారు. వాటిని గంట నుంచి మూడు గంటల్లో కూల్చాలి. లేదంటే.. న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తెచ్చుకుంటారు. ఎన్-కన్వెన్షన్‌ను కూల్చేటప్పుడు అలాంటి అడ్డంకి వస్తుందని ముందే ఊహించాం. ముందు రోజు 3డీ చిత్రంతో ఆన్‌లైన్‌లో నమూనా కూల్చివేత చేపట్టాం. మరుసటి రోజు పది గంటల్లోపు కట్టడాన్ని నేలమట్టం చేశాం. వ్యర్థాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను మోహరించాం. సమస్యలు ఉండొద్దనే సరైన యంత్ర సామగ్రిని, సంస్థలను సమకూర్చుకుంటున్నాం. కూల్చివేతలకు నాలుగు గంటల ముందు గుత్తేదారుకు పిలుపు వెళ్తోంది. ఓఆర్‌ఆర్ పరిధిలో ఎక్కడికైనా వాహనాలను తీసుకెళ్లాల్సి ఉంటుంది" అని హైడ్రా తెలిపింది.

# కొత్త బృహత్ ప్రణాళిక



కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో సమగ్రాభివృద్ధి, భవిష్యత్తు అవసరాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేయడం కోసం కొత్త ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రెండేళ్ల క్రితమే మాస్టర్ ప్లాన్ తయారు ప్రక్రియను ప్రారంభించారు. సాంకేతిక కారణాలతో నిలిపివేయగా మళ్లీ ఈ అంశం తెరపైకి వస్తోంది.

కరీంనగర్ నగరపాలక సంస్థ, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) పరిధిలో పట్టణీకరణ పెరిగింది. నగరంలో విలీన గ్రామాలు కలిశాయి. గ్రామాల్లో సైతం పట్టణ స్థాయిలో వసతుల కల్పన జరుగుతోంది. కాలనీల సంఖ్య పెరిగిపోవడంతో ఎక్కడ పడితే అక్కడ లేఅవుట్ లేకుండా స్థలాలు కొనుగోలు చేయడంతో అనేక సమస్యలకు కారణంగా మారుతోంది. అమృత్ నగరంతో పాటు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో కొత్త బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ప్రకారం రహదారులు కొలతలు, పార్కులు, సామాజిక స్థలాలు, ప్రభుత్వ స్థలాల గుర్తింపు, పారిశ్రామిక ప్రాంతం, నివాసిత, వాణిజ్య ప్రాంతాలు సులువుగా గుర్తించి అనుమతులు ఇచ్చే అవకాశముంటుంది.

ఇప్పటికే బేస్ మ్యాపు తయారు

కొత్త ప్రణాళికను తయారు చేసేందుకు వీలుగా రెండేళ్ల క్రితమే ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. భౌగోళిక సమాచార విధానం (జియో గ్రాఫికల్ ఇన్మరేషన్ సిస్టమ్) జీఐఎస్ విధానంలో మాస్టర్ ప్లాన్ సర్వే చేపట్టారు. నివాసిత, వాణిజ్య ప్రాంతాలు, రోడ్లు, భవనాల ఎత్తు, మురుగునీటి కాలువలు, ప్రభుత్వ స్థలాలు పలు వివరాలతో బేస్ మ్యాపు తయారు చేశారు. నగరపాలిక, సుడా పరిధిలో జీఐఎస్ ఆధారిత ప్రణాళికపై తుది కసరత్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో అప్పటి కలెక్టర్, నగర మేయర్ సునీల్‌రావు, అప్పటి సుడా ఛైర్మన్ అధ్యక్షతన పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు.

27 ఏళ్ల నాటిదే అమలు

కరీంనగర్ నగర పరిధిలో 1997లో ఆమోదించిన పట్టణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ ఇరవై ఏళ్లకు ఒకసారి దీన్ని తయారు చేయాల్సి ఉంటుంది. నాటి పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే భవన అనుమతులు, రహదారుల విస్తరణకు వాడుతున్నారు. జిల్లాలో కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు అయ్యాయి. కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. సరిహద్దులు మారాయి. కొత్త ప్రణాళికలు తప్పనిసరిగా మారింది.

ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ

కొత్త మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు అమృత్ పథకం నిధులు కేటాయించనుంది. డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆ పథకం గడువు ముగుస్తోంది. ఆ తర్వాత ఎవరికి వారు నిధులు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. నెలాఖరులోగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రజాభిప్రాయాన్ని తీసుకొని మార్పులు చేర్పులుంటే పరిగణలోకి తీసుకుంటారు. అందరి అభిప్రాయం మేరకు, గడువులోగా మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు.

తీరనున్న ఇబ్బందులు

మాస్టర్‌ప్లాన్ అమలు జరిగితే సుడా పరిధితో పాటు నగరంలోని విలీన కాలనీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇంటి అనుమతులు సులువుగా పొందే వీలుంటుంది.

గతంలో తీగలగుట్టపల్లి బఫర్ జోన్‌లో ఉండేది. అక్కడ రైల్వేస్టేషన్ ఉండటంతో పారిశ్రామిక ప్రాంతంగా నగరపాలికలో ఉంది. దీనిని సవరిస్తే నివాసిత ప్రాంతంగా మారనుంది.

నగరంలో రహదారులు, భవనాల శాఖ పరిధిలోని వంద అడుగుల రహదారి ఉంది. రహదారి విస్తరించడంతో మిక్స్‌డ్ యూజ్‌లోకి తీసుకుంటారు.

కట్టరాంపూర్‌లో వ్యవసాయ భూమి ఉండగా అది రెసిడెన్షియల్ కిందికి వస్తోంది.

కోతిరాంపూర్‌లో కొంత ప్రాంతాన్ని వాణిజ్య ప్రాంతంగా పరిగణలోకి తీసుకునే వీలుంది.

భగత్‌నగర్ గోదాముల వెనుకాల ఉన్న ప్రాంతంలో ఇంటి అనుమతులే ఇవ్వడం లేదు. అక్కడ ప్రస్తుతం అన్ని నివాసిత ఇళ్లు నిర్మించుకున్నారు. అలాంటి ప్రాంతాన్ని మార్చుకోవచ్చు.

సుడాతో పాటు, నగరంలోని అన్ని వీధి రహదారులు ఇక మీదట 30 అడుగులకు ఉండనున్నాయి.

# వైభవంగా భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు





శామీర్ పేట, (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. బుధవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. తూముకుంటకు చెందిన భజన మండలి, శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యుల భక్తి గీతాలు ఆలపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# నిర్దిష్ట గస్తీ.. ప్రమాదాలకు స్వస్తి..!

కొత్తగూడెం : రోడ్డు భద్రతలో సురక్షిత మౌలిక సదుపాయాలు, వేగ పరిమితులు, పాదచారులు, సైకిల్ చోదకుల అనుకూల విధానాల ద్వారా స్వీడన్ దేశంలో ప్రమాదాలు సున్నాకు చేరాయి. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాల శాతాన్ని సున్నాకు తీసుకు రావాలనే లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల (బ్లాక్ స్పాట్లు)ను గుర్తించి అక్కడ మెరుగైన సదుపాయాలు కల్పించటంతో పాటు పోలీసుల గస్తీ ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చునని అధికార యంత్రాంగం భావిస్తోంది.

అతివేగం, మద్యం తాగి వాహనం నడపటం, పరిమితికి మించిన లోడ్‌తో వెళ్లటం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రోడ్లు నిత్యం నెత్తురోడుతున్నాయి. ప్రతినెలా సగటున 20 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు వినూత్న చర్యలకు సిద్ధమవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, సమయాన్ని సాంకేతికంగా అధ్యయనం చేసి ప్రత్యేక గస్తీ నిర్వహించాలని భావిస్తున్నారు.

సంబంధిత ఠాణాలకు బాధ్యతలు..

ఉభయ జిల్లాల్లో ఎక్కడెక్కడ, ఏ సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో వివరాలు తెప్పించి విశ్లేషిస్తున్నారు. అత్యధిక ప్రమాదాలు ఉదయం 5-6, 8-9 గంటల మధ్య, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 మధ్య జరుగుతున్నట్లు గుర్తించారు. నిర్దిష్ట సమయాల్లో ఆయాచోట్ల గస్తీ నిర్వహించనున్నారు. ఈ బాధ్యతలను సంబంధిత ఠాణాలకు అప్పగించనున్నారు. 'నిర్దిష్ట' గస్తీతో బ్లాక్ స్పాట్లలో ప్రమాదాలు జరగకుండా చూడాలని పోలీసుశాఖ నిర్ణయించింది.

వివిధ శాఖల సమన్వయంతో..



గడిచిన మూడేళ్లలో జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది మృతిచెందిన ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తిస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు పోలీసు, పంచాయతీరాజ్, రవాణా, రెవెన్యూ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయనున్నారు. అవసరమైనచోట్ల గుంతలు పూడ్చించటం, మరమ్మతులు చేపట్టడం, రహదారులను సరిచేయటం, బారికేడ్లు అమర్చటం, జీబ్రా గీతలు, డివైడర్లు, సీసీ కెమెరాలు, వేగ నియంత్రికలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేయనున్నారు.

జిల్లా రోడ్డు భద్రత కమిటీ పర్యవేక్షణలో బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ, రాష్ట్ర, ఇతర ప్రధాన రహదారులను అనుసంధానించే రోడ్లపై అవసరమైనచోట్ల వేగ నియంత్రికలు నిర్మిస్తున్నాం. ప్రధాన రహదారులపై హెచ్చరిక బోర్డులు, మలుపులను తెలిపే సూచికలు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటాం. బ్లాక్ స్పాట్లలో పోలీసు గస్తీని పెంచుతాం. సునీల్‌దత్, సీపీ, ఖమ్మం

# గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తయ్యేనా?

కరీంనగర్ : జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు పరిష్కారానికి ప్రభుత్వం గడువు విధించింది. వచ్చే నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని మున్సిపాలిటీలకు ఆదేశాలు ఇవ్వడంతో పట్టణ ప్రణాళికతో పాటు ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు ఖాళీ స్థలాల దగ్గరికి పరుగులు పెడుతున్నారు. రోజు వారీగా లక్ష్యాన్ని విధించడంతో లెవు రోజులలో కూడా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ చేసుకుంటున్నారు.

దరఖాస్తుదారుల అవస్థలు

క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసిన అర్జీదారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ దరఖాస్తులను కేటాయించిన అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లి పోతుండగా ఆ తర్వాత సమాచారం ఉండటం లేదు. ఫీజు ఎంతమేర వేస్తున్నారు? మళ్లీ చేపట్టే ప్రక్రియ ఏమిటనే వివరాలు మాత్రం కార్యాలయాల్లో లభించడం లేదు. పైగా కొంతమంది దరఖాస్తు దారుల సెల్‌ఫోన్‌కు సమాచారం కూడా రావడం లేదంటున్నారు. అత్యధిక శాతం అర్జీలు నిషేధిత జాబితాలో వెళ్లడంపై ఆందోళన నెలకొంటుంది. ఇళ్ల మధ్యన ఉన్న ప్లాట్లకు నిషేధిత జాబితాలో పేర్కొనడం ఏమిటని ఆగ్రహిస్తున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం!

ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలనలో అధికారుల మధ్య సమన్వయ లోపం



కనిపిస్తోంది. కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు ఇతర మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల ఉద్యోగులకు అప్పగించారు. మూడు దశల్లో వీటిని పరిశీలిస్తుండగా మొదటి దశలో టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ కలిసి స్థలాన్ని క్రమబద్ధీకరించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి జియోట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఇలా కాకుండా ఎవరికి వారే పరిశీలన చేస్తుండటంతో అర్జీల సంఖ్యలో తేడాలు ఉంటున్నాయి.

ఎవరి బాధ్యత ఏంటంటే..

టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పరిశీలించి డాక్యుమెంట్లు పరిశీలిస్తున్నారు.

రెవెన్యూ విభాగం ఉద్యోగులు ఆ స్థలం వివాదస్పదంగా ఉందా? కేసులు ఉన్నాయా? ప్రభుత్వానిదా? ప్రైవేటుదా అనేది నిర్ధారించాలి.

ఇరిగేషన్ ఉద్యోగులు క్రమబద్ధీకరించే స్థలం చెరువులు, డ్యాంలు, నీటిపారుదలకు సంబంధించినవా? కాదా చూడాల్సి ఉంటుంది.

వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తాం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం బల్దియా తరఫున 15 మంది పని చేస్తున్నారు. వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తాం. ఇతర శాఖల అధికారులకు డ్యూటీలు ఉండటంతో కొంతమేర సమస్య వస్తుంది. దీనిని అధిగమించేలా ఉన్నతాధికారులకు వివరిస్తాం.

వేణు, ఇన్‌ఛార్జి ఏసీపీ, కరీంనగర్ నగరపాలిక

# షరతులు వర్తిస్తాయి..!

హుజూర్‌నగర్: ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లులకు షరతులతో ఇవ్వాలని నిర్ణయించింది. చాలా కాలం తరువాత మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా బ్యాంకు గ్యారంటీలతో మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించాలని నిర్ణయించింది. గతంలో సీఎంఆర్ విషయంలో మిల్లర్ల చరిత్రను చూసి ఇవ్వాలని నిర్ణయించింది. డిఫాల్ట్ మిల్లులన్నింటినీ బ్లాక్ లిస్ట్‌లో పెడితే సీఎంఆర్ చేయడం ఇబ్బంది అవుతుందన్న ఆలోచనతో ఉంది. ఉమ్మడి జిల్లాలో 100కు పైగా డిఫాల్ట్ మిల్లులున్నాయి. వారిలో.. ఆలస్యంగా, ప్రభుత్వం చర్యలు తీసుకున్న తరువాత సీఎంఆర్ పెట్టిన వారికి 20శాతం బ్యాంకు గ్యారంటీతో ధాన్యం కేటాయించాలని నిర్ణయించారు. గత సంవత్సరం వానాకాలం, యాసంగిలోని డిఫాల్ట్ మిల్లులు ఉమ్మడి జిల్లాలో దాదాపు 37 ఉన్నట్లు గుర్తించారు. వీటిని ధాన్యం కేటాయింపులకు దూరంగా ఉంచుతారు.

మంత్రివర్గ నిర్ణయం ప్రకారం

సీఎంఆర్ సక్రమంగా ఇచ్చిన మిల్లులకు 10శాతం బ్యాంకు గ్యారంటీతో ధాన్యం కేటాయింపు.

గతంలో డిఫాల్ట్ అయి బకాయిలు పూర్తి చేసిన మిల్లుల వారు 20 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి.

బకాయిలు పూర్తి చేసి ప్రభుత్వం విధించిన 25 శాతం జరిమానాను చెల్లించని వారు కొందరు ఉన్నారు. ఆ మిల్లర్లు మాత్రం 25 శాతం బ్యాంకు గ్యారంటీ ఇస్తేనే సీఎంఆర్ ధాన్యం ఇస్తారు.

మిల్లర్ల కొత్త ఎత్తుగడ

ఉమ్మడి జిల్లాలో కొందరు మిల్లర్లు సీఎంఆర్ బకాయిలు ఇవ్వకుండా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. తమ మిల్లులను సీజ్ చేయడంతో కొందరు కొత్తవి నిర్మాణం చేసుకుంటున్నారు. సీజ్ చేసిన వాటి నుంచి మిల్లుకు కావాల్సిన యంత్రాలను తరలించి కొత్తగా నిర్మాణం చేసి సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ధాన్యం దించుకోవాల్సిందే

బ్యాంకు గ్యారంటీలపై, డిఫాల్ట్ మిల్లుల విషయంపై నిర్ణయం తీసుకున్న మంత్రి వర్గం సన్న రకాల ధాన్యం మిల్లింగ్ విషయంపై ఇంకా ప్రకటించలేదు. కానీ మిల్లింగ్ ఛార్జీలు మాత్రం పెంచింది. ఇక ఇప్పటి వరకు తమ డిమాండ్‌లు తీర్చకపోతే ధాన్యం దించుకోబోమని మిల్లర్లు పట్టుబట్టడంతో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుని ధాన్యం దించుకోవాల్సిందేనని, లేనిపక్షంలో వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మిల్లు సామర్థ్యం మేరకు సగం వరకు ధాన్యం.. కొనుగోలు కేంద్రాలదే ఉండాలని కూడా షరతు పెడుతున్నారు. ప్రైవేటుగా కొన్న ధాన్యం లెక్క ప్రత్యేకంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన లెక్క వేరే ఉండాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే నెమ్మదిగా ప్రారంభమైనందున కొన్న సన్న రకాలను అవసరమైతే గోదాములకు తరలించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అధికారులు 30 వేల ఎంటీలు నిల్వ చేసే విధంగా గోదాములను సిద్ధం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# మీ పిల్లలకు ఇదే పెడతారా..?



హైదరాబాద్: నగరంలో ఆహార కల్తీ విచ్చలవిడిగా జరుగుతోంది. బస్తీలు, శివారులోని రేకుల షెడ్లలోని బట్టీల్లో నాసిరకం తినుబండారాలు భారీగా తయారవుతున్నాయి. వాటిని ఇష్టమొచ్చిన పేర్లతో ప్యాకింగ్ చేసి.. పేదలు, మధ్య తరగతి ప్రజలు నివాసముంటున్న ప్రాంతాల్లో అమ్ముతున్నారు. చింతలబస్తీలోని ఓ ఇంట్లో తయారైన మోమోస్‌లు.. ఓ మహిళను బలిగొని, దాదాపు 60 మందిని ఆస్పత్రిపాలు చేశాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గడిచిన పది నెలల్లో అల్వాల్‌లోని ఓ హోటల్‌లో షవర్మ తిన్న వ్యక్తులు నాలుగు సార్లు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. పాతబస్తీలో తయారయ్యే కల్తీ పాలు, ఇతర డెయిరీ వస్తువులు సేవించే చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. బోరబండ, మాదాపూర్‌లోని బస్తీల్లో తయారయ్యే పానిపూరిలు తినేవారికి వాంతులు, విరేచనాలు సాధారణమయ్యాయి. నిత్యం బిర్యానీలోనో.. కూరల్లోనో.. కప్పలు, బల్లులు, బొద్దింకలు వచ్చాయంటూ జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

గుడ్డిగా తింటున్నారు..

నగరంలో కోటి జనాభా ఉంది. అందులోని 70 శాతానికిపైగా ప్రజలు రోజూ ఇంటి నుంచి బయటికెళ్లి ఉద్యోగం, వ్యాపారం చేసుకుంటున్నారని అంచనా. హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కన తోపుడు బండ్లు, గల్లీ దుకాణాల్లో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. అపరిశుభ్రతలోనే తయారీ..

బోరబండ సైట్-3 నవభారత్‌నగర్‌లో, పర్వత్‌నగర్, అల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పానీ పూరీల తయారీ కేంద్రాలు అనేకం ఉన్నాయి. ఉపయోగించే పిండి, నూనె, ఆ వాతావరణమంతా అనారోగ్యకరమే.


కాటేదాన్ నుంచి ఘట్‌కేసర్ వరకు, శామీర్‌పేట నుంచి గండిమైసమ్మ వరకు ఉన్న అనేక శివారు ప్రాంతల్లో కోడి మాంసం, మొక్క జొన్న పిండి, శెనగపిండితో తయారయ్యే అనేక రకాల చిరుతిండ్ల తయారీ కేంద్రాలు ఉన్నాయి. మరుగుదొడ్లకు, తయారీ కేంద్రాలకు ఏ మాత్రం వ్యత్యాసం ఉండదని, తినడం, నిద్రించడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, బట్టీల్లో టన్నుల కొద్దీ తినుబండారాలను తయారు చేసున్నారు.

మసాల కలిపి అమ్ముతున్న మాంసాహార ముక్కల ప్యాకెట్లకు ఆన్‌లైన్‌లో ఇటీవల ఆదరణ పెరుగుతోంది. లైసెన్సు లేకుండా, నకిలీ బ్రాండ్లతో, వారం పది రోజుల ముందు ప్యాకింగ్ తేదీలతో సరకును సిద్ధం చేసిన సరకును కొన్ని డెలివరీ సంస్థలు విక్రయిస్తున్నాయి.

అధికారులకు తెలిసే..

బేగంబజార్లోని ఏ దుకాణాల్లో కల్తీ కిరాణా సరకులు ఉంటాయి, బస్తీలో లైసెన్సులేని తినుబండాలు తయారువుతున్నాయి, హోటళ్లు కుళ్లిన మాంసంతో వంటలు చేస్తున్నాయి, వ్యాపారి ఏ మేర కల్తీ దందా చేస్తారనే సమాచారం జీహెచ్ఎంసీ ఆహార కల్తీ నియంత్రణాధికారుల వద్ద ఉంటుంది. కానీ వారు తనిఖీలు, దాడులు అరుదుగా చేస్తుంటారు. నమూనాలను సేకరించి.. నివేదికలను అటకెక్కించడం, యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకోవడంలో కొందరు తీరికలేకుండా గడుపుతుంటారనే విమర్శలున్నాయి.

# అనుమతుల్లో మార్పు.. పలు శాఖల చేర్పు



హైదరాబాద్ : హెచ్ఎండీఏ పరిధిలో ఇకనుంచి భవనాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి ప్రాథమిక స్థాయి అనుమతులు (ఎల్1) క్లియరెన్స్‌లో మార్పులు చేశారు. దరఖాస్తుల పరిశీలనలో హెచ్ఎండీఏతోపాటు మండలాల రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలను భాగస్వామ్యం చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ, నీటి పారుదల శాఖ నుంచి ఏఈ, హెచ్ఎండీఏ నుంచి జేపీవో/ఏపీవోలు భవన, లేఅవుట్ల ఎల్1 అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం హెచ్ఎండీఏ స్థాయిలో ప్లానింగ్ అధికారి, డైరెక్టర్ నిర్ణయం తీసుకుంటారు.

ఇక నుంచి ఇలా..

లేఅవుట్లు, 5 అంతస్తుల దాటిన భవనాల అనుమతులకు దరఖాస్తు చేసిన తర్వాత వివరాలు హెచ్ఎండీఏతోపాటు రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలకు చేరుతాయి. ఈ మూడు విభాగాలు పరిశీలించాక సంతృప్తి చెందితే దరఖాస్తు ముందుకు కదులుతుంది.

ఎల్1 పరిశీలనలో భాగంగా భూమి అసలు యజమాని ఎవరు? ఏమైనా ప్రభుత్వ భూమి అందులో ఉందా.. నిషేధిత జాబితాలో ఉందా.. కోర్టు వివాదాలు ఏమైనా ఉన్నాయా.. తదితర వివరాలను రెవెన్యూ శాఖ పరిశీలించి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో నివేదిక అప్‌లోడ్ చేస్తుంది. తరువాత దరఖాస్తు ఇరిగేషన్ శాఖ పరిధికి వెళ్తుంది. ఏవైనా చెరువులు, వాగులు, ఇతర నీటి కుంటలు ఉన్నాయా లేదా పరిశీలిస్తుంది.

తర్వాత హెచ్ఎండీఏ స్థాయిలో మాస్టర్‌ప్లాన్ ప్రకారం లేఅవుట్ లేదా భవనం ఏ జోన్‌లో ఉంది.. రహదారులు ఏమైనా లేఅవుట్‌పై నుంచి వెళ్తున్నాయో పరిశీలిస్తారు.

అనంతరం ఎల్2 స్థాయిలో ప్రణాళిక అధికారి (పీవో) మరోసారి దరఖాస్తును పరిశీలిస్తారు. క్షేత్రస్థాయిలోనూ చూసి ఎల్1 స్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన నివేదికపై తనిఖీ చేసి సంతృప్తి చెందిన తర్వాతే ఆమోద ముద్ర వేస్తారు. అనంతరం డైరెక్టర్ వద్దకు చేరుతుంది. ఎల్1 అనుమతుల్లో ఎక్కువ శాఖలను భాగస్వామ్యం చేయడం వల్ల దరఖాస్తుల పరిష్కారం మరింత జాప్యం జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే రకరకాల కొర్రీలతో 2-3 నెలల సమయం పడుతోంది. అడిగినంత ఇవ్వనిదే ఫైళ్లు కదలడం లేదనేది బహిరంగ రహస్యం. ఇకనుంచి హెచ్ఎండీఏతోపాటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే.. అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ మార్పులు తీసుకొచ్చినా అవి అనుమతుల్లో మరింత వేగం పెంచేలా చర్యలు ఉండాలని కోరుతున్నారు.

# తాగు నీటి కొరత.. తప్పని అవస్థ



తాండూరు: జిల్లాలో అతి పెద్ద పురపాలక సంఘంగా పేరున్న తాండూరులోని జనాభా అవసరాలకు తగ్గట్టు తాగు నీటి సరఫరా జరగడం లేదు. చేసేది లేక ప్రజలు కాలనీల్లోని బోర్లపై ఆధార పడక తప్పడం లేదు. పట్టణంలోని రెండు పంప్‌హౌస్‌లను పూర్తిగా వినియోగంలోకి తీసుకువస్తే ఎద్దడి సమస్య తీరే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు.

1953లో అప్పటి అవసరాలకు తగినట్లు నిర్మాణం

తాండూరు మున్సిపాలిటీ 1953లో ఏర్పాటైంది. అప్పటి ప్రజల తాగు నీటి అవసరాకు తగినట్లు పాత తాండూరు సమీపం కాగ్నానదిని ఆధారం చేసుకుని నీటి సరఫరా పంప్‌హౌస్ నిర్మాణం చేశారు. ప్రత్యేక పైపులైన్ నుంచి నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల్లో నీటిని నింపి అంతర్గత పైప్‌లైన్ ద్వారా నిత్యం 3ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్ ఫర్ డే)సరఫరా చేశారు. 2010 వరకు సజావుగా కొనసాగిన పంప్ హౌస్ తర్వాత నిర్వహణ లేక తరచూ మరమ్మతుకు గురౌతూ వచ్చింది. పరిస్థితి ఇలా ఉండగానే 2009-10లో పట్టణంలోని కొడంగల్ రోడ్డు వారగా కాగ్నానది ఆధారంగా రూ.5.80 కోట్ల వ్యయంతో మరో కొత్త పంప్‌హౌస్ నిర్మించారు. దీని నుంచి మరో 3ఎం.ఎల్.డి. సరఫరా చేయడంతో ఎద్దడి తీరింది. ఎనిమిదేళ్ల పాటు పంప్‌హౌస్ సజావుగా కొనసాగడంతో సమస్య ఉత్పన్నం కాలేదు. తర్వాత పైపులైన్ల లీకేజీలకు గుయ్యాయి. అధికారులు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగానే గతేడాది తాండూరు మీదుగా మహబూబ్‌నగర్ వైపు నిర్మాణంలో పైపులైన్లు ధ్వంసమయ్యాయి. దీంతో నీటి సరఫరాకు అవకాశం లేకుండా పోయింది. మరో పక్క పాత పంప్‌హౌస్‌ను రూ.లక్షలు వ్యయం చేసి మరమ్మతు చేసినా ఇంకా వినియోగంలోకి తీసుకు రాక పోవడంతో సమస్య క్లిష్టంగా మారింది. పంప్‌హౌస్‌ల బాగుకు రూ.15 కోట్లు కావాలి తాండూరు పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో నీరందించేందుకు అవసరమైన రెండు పంప్‌హౌస్‌ల అన్నిరకాల మరమ్మతుకు రూ.15 కోట్లుకావాలి. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైతే పంప్‌హౌస్‌లను పూర్తి స్థాయిలో బాగు చేసి అవసరానికి తగ్గట్టు నీటిని సరఫరా చేస్తాం. ఖాజాహుస్సేన్, సహాయ ఇంజినీరు, తాండూరు మున్సిపాలిటీ.

# వంతెన కల నెరవేరేదెలా?

పెద్దపల్లి: గోదావరి నది, మానేరు వాగుల నడుమ జిల్లా విస్తరించి ఉండటంతో ప్రజలకు వంతెనల ఆవశ్యకత ఏర్పడింది. పొరుగు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి వారధులు లేకపోవడంతో గ్రామీణులు ఆర్థిక, దూరాభారాలతో ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఎండకాలం మినహా మిగతా కాలాల్లో రైళ్లు, బస్సుల్లో వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గోదావరిపై గోదావరిఖని, రాయపట్నం, కాళేశ్వరం వద్ద గల వంతెనలు.. సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు జిల్లావాసులు మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఉపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరో ప్రధానమైన యేరు(మానేరు)పై మూడు వంతెనలున్నాయి. మానేరు వాగు గ్రామీణ ప్రాంతాల గుండా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు వంతెనల కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై రూ.80 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో మరికొన్ని గ్రామాల్లో కూడా వంతెనల నిర్మాణానికి ప్రజల నుంచి డిమాండ్ పెరిగింది. కాగా కొన్ని ప్రాంతాల్లో వంతెనలు ఉన్న పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. అలాంటి వాటిపై కథనం.

నెరవేరని స్పీకర్ హామీ

కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణా



నికి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి హామీ ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల నుంచి మానేరులో నిర్మించిన తాత్కాలిక మట్టిరోడ్డుపై కిష్టంపేట వరకు ద్విచక్రవాహనంపై ఆయన వచ్చి వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం మారడంతో వంతెన హామీ వరకే ఆగిపోయింది.

గాలికి కూలిన వంతెనముత్తారం మండలం ఓడెడ్ సమీపంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 2016లో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే భూపాలపల్లి వెళ్లేందుకు సమీప ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. కానీ వంతెన పలు సందర్భాల్లో వరదలకు కొట్టుకుపోవడం, గాలులకు పడిపోవడం జరిగింది. నిర్మాణ వ్యయం రూ.50 కోట్లకు పెరిగినప్పటికి నాణ్యత లోపాలతో వంతెన నిర్మాణం కలగానే ఉంది.

అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగం

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, మానకొండూర్ మండలం వేగురుపల్లి మధ్య మానేరుపై 2016లో రూ.20 కోట్లతో వంతెన నిర్మించారు. కానీ దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. వంతెనకు ఇరువైపులా ప్రభుత్వం అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులే రోడ్డు వేసుకున్నారు. ఈ వంతెనపై నుంచి ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు ఇతర వాహనాలు మాత్రమే వంతెనను వినియోగించుకుంటున్నాయి.

# పశువైద్యం.. దైన్యం..!

మేళ్లచెరువు : ప్రభుత్వ పశు వైద్యశాలల్లో జీవాలకు ఉచిత వైద్యంతోపాటు మందులు పంపిణీ చేయాల్సి ఉంది. అవేమి అందక పాడి రైతు సొంతంగా ఖర్చు చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అరకొరగా మందుల పంపిణీ జరుగుతుండటంతో బయట కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఔషధాలు సరఫరా అవుతున్నా రైతుల దరి చేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోగ నిర్ధారణ పరీక్షలు కరవు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5,39,406 పశువులు ఉన్నాయి. వీటికి సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ఇవి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నా పాడిరైతులకు మాత్రం అందటం లేదు. పశువులకు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదు. ఏమైనా రోగాలొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని పెంపకందారులు చెబుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా పరీక్షల నిర్వహణలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ అధికారులు దాటవేస్తున్నారు.

రవాణా భారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పశువైద్యశాలకు సంబంధించిన అంబులెన్సులు ఎక్కడా లేవు. ఉమ్మడి జిల్లాలో 277 పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటికి ఒక్క అంబులెన్సు కూడా కేటాయించలేదు. దీంతో పశువులకు ఏమైనా చికిత్స అవసరమొస్తే మండల




కేంద్రాలకు తీసుకెళ్లడానికి పాడిరైతులు నానా తంటాలు పడుతున్నారు. సొంతంగా వాహనాలను సమకూర్చుకొని తరలిస్తున్నారు.

బయట కొనమంటున్నారు

నాగిరెడ్డి, పాడిరైతు, మేళ్లచెరువు

పాడి గేదెలు అనారోగ్యానికి గురైతే పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లేవాళ్లం. అక్కడ ఒకటి రెండు మందులు ఇచ్చి మిగతావి బయట కొనుక్కోమనేవాళ్లు. ఒక్కోసారి అవి కూడా లేవని చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వడం లేదని సమాధానమిస్తున్నారు. ఇలాంటప్పుడు ఆసుపత్రికి ఎందుకని బయటనే వైద్యం చేయిస్తున్నాం.

ప్రతిపాదనలు పంపిస్తాంశ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేట జిల్లాలో పశువైద్యశాఖకు సంబంధించిన అంబులెన్సు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంచార వాహనాలతో రైతుల వద్దకు వెళ్లి చికిత్స అందిస్తున్నాం.

# బావులు... ప్రమాదాలకు హేతువులు

ముస్తాబాద్ : అదుపు లేని వేగంతో రోజు రోజుకు ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. మరోవైపు ప్రధాన రహదారుల పక్కన, మలుపుల వద్ద ఉన్న బావుల చుట్టూ చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగాయి. బావుల ఆనవాళ్లు కనిపించడం లేదు. పొదల మధ్య ఉన్న ప్రమాదకర బావులతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ముస్తాబాద్ మండలంలో గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన, మలుపుల వద్ద వ్యవసాయ, నిరుపయోగంగా ఉన్న బావులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాటి చుట్టూ మొక్కలు, చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించడం, నిరుపయోగంగా ఉన్న వాటిని పూడ్చివేయించడం చేయాలని కోరుతున్నారు. వాటి చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

ముస్తాబాద్ నుంచి మద్దికుంట వెళ్లే రోడ్డు పక్కన చెట్ల పొదల మధ్యలో వ్యవసాయ, నిరుపయోగ బావులు ఉన్నాయి. అలాగే మద్దికుంట నుంచి చీకోడ్, చీకోడ్ నుంచి మొర్రాయిపల్లె, మొర్రాయిపల్లె నుంచి ముస్తాబాద్ వచ్చే రహదారుల పక్కన బావులు ఉన్నాయి.

ముస్తాబాద్ శివారు కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రోడ్డు పక్కన, తెర్లుమద్ది నుంచి సేవాలాల్‌తండా వెళ్లే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్నాయి. వీటితోపాటు పలు గ్రామాల్లో ప్రధాన రోడ్డు పక్కన బావులు ఉండటంతో రాత్రి వేళలో రయ్ రయ్‌మంటూ ఎదురుగా వచ్చే వాహనాలను



తప్పించబోయి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

**అడ్డుగోడలు నిర్మించాలి**

రోజు రోజుకు వాహనదారుల వేగం పెరిగిపోతుంది. యువత రయ్ రయ్‌మంటూ వాహనాలపై తిరుగుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోతూ రోడ్డు దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి అదుపు తప్పితే పక్కన ఉన్న ప్రమాదకర బావుల్లోకి చొచ్చుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు శ్రద్ధ తీసుకొని మండలంలోని ఆయా గ్రామాల ప్రధాన రోడ్ల పక్కన ఉన్న బావులను గుర్తించాలి. సంబంధిత బావుల యజమానులకు అవగాహన కల్పించి, అడ్డుగోడలు నిర్మించుకోనేలా చూడాలి.

శాదల లక్ష్మణ్, నామాపూర్

**చర్యలు చేపడతాం**

గ్రామాల్లో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న బావుల వివరాలను క్షేత్రసహాయకుల ద్వారా ఆయా గ్రామాల కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లేలా చొరవ చూపుతాం. సంబంధిత గ్రామాధికారులు బావుల యజమానులకు అవగాహన కల్పించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చొరవ చూపితే బాగుంటుంది. ఉపాధి హామీ కూలీల ద్వారా ప్రమాదకర బావుల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు చేపడతాం.

ఆనంద్ మోహన్, ఏపీవో

# కాగుతున్న నూనెలు.. కూర'గాయాలు'



హైదరాబాద్: గణేశ్ చతుర్థితోనే పండగల కాలం మొదలైంది. ఇక వరుసగా వచ్చే పండగలకు పిండి వంటలు ఒండుదామంటే.. వంట నూనెల ధరలు భయపెడుతున్నాయి. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయి. అలాగే ఖరీఫ్ కాలం పూర్తయి.. రబీకాలం పంట ప్రారంభమయ్యే లోపు పెరగాల్సిన కూరగాయలు సెప్టెంబరులోనే భగ్గుమంటున్నాయి. నూనె ప్యాకెట్టు కొనాలన్నా.. కూరగాయలు తెచ్చుకుందామన్నా సామాన్యులు వెనుకడుగువేయాల్సిన పరిస్థితి వంటగదిలో ధరల మంట మోగిస్తోంది. నూనెలు, వెల్లుల్లి, కాయగూరలు, కొత్తిమీర ఇలా ప్రతిదీ ధర పెరగడంతో నెలవారీ బడ్జెట్ పెరిగిపోతోంది.

**కారణాలు ఇవి..**

వర్షాలతో పంటలు దెబ్బతినడంతో కాయగూరలు, వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో అన్నీ రకాల నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అన్నీ ధరలు ఒకేసారి పెరగడంతో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

వర్షాల కారణంగా కొత్తిమిరతో పాటు ఆకు కూరలు దెబ్బతిన్నాయి. రైతుబజార్లలో రూ.300 కేజీ చొప్పున కొత్తిమిర విక్రయిస్తుండగా బహిరంగ మార్కెట్‌లో బంగారంలా తూచి విక్రయిస్తున్నారు.

బెండకాయ, కాకర, బీరకాయ, బిన్నీస్, గోకరకాయ, క్యాప్సికం ధరలు బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100 చొప్పున ధర పలుకుతోంది.

ఉల్లి ధరలు ఘాటెక్కాయి. బహిరంగమార్కెట్‌లో రూ.60లు కేజీ చొప్పున విక్రయిస్తున్నారు.

వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. కేజీ రూ.450 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం కేజీ రూ.160కి విక్రయిస్తున్నారు.

మూడు రోజుల క్రితం వరకు రైతుబజార్లలో రూ.20 కేజీ ఉన్న టమాటా ప్రస్తుతం రూ.39కి చేరింది. రిటైల్ ధర రూ.45గా నిర్ణయించగా బహిరంగ మార్కెట్‌లో రూ.60కి విక్రయిస్తున్నారు. ఉల్లిగడ్డ రూ. వంద పెడితే కాని రెండు కిలోలు రావడంలేదు. మెహిదీపట్నం, ఫలక్‌నుమా, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, అల్వాల్, రామక్రిష్ణాపురం, సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలకు కేవలం 552 క్వింటాళ్ల చొప్పున స్టాక్ వచ్చింది.

# అన్నదాత సేద్యానికి అడ్డంకులు



కరీంనగర్ : మండలంలోని ఎస్సారెస్పీ డి–94 కాలువ ఆయకట్టు రైతులు వానకాలం, యాసంగి పంటలకు సరైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో నాచు పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు.

**మురుగు చేరి.. అధ్వానంగా మారి..**

కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి వచ్చే డి–94 కాలువ రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి మీదుగా వెళ్తోంది. కరీంనగర్ గ్రామీణ మండల పరిధిలో 5,293 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. అయితే రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి వద్ద మురుగు నీరు నేరుగా ఈ కాల్వలోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు కాల్వలో నాచు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేస్తే సీతారాంపూర్, రేకుర్తి వద్ద కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. రైతులు ఎస్సారెస్పీ అధికారులకు మొరపెట్టుకున్నా నగరపాలక సంస్థ తీరుతో సమస్య పరిష్కారం కనుచూపుమేరలో కానరావటం లేదు. ప్రస్తుత వానకాలంలో కాల్వనీటి ఆధారంగా, వర్షాధారంగా పలు గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు వేశారు. బావులు, బోర్లు లేని పంటలు ఎడే పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది.

**ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!**

గతంలో కాల్వ నీటిని పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు నగరపాలక సంస్థ మురుగు నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడుదల చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

అధికారులు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం కాల్వలో పేరుకుపోయిన నాచును తొలగించాలని సూచించారు.

నాచును తొలగించటానికి నగర పాలక సంస్థ టెండర్లు పిలిచింది. రూ.4.85 లక్షలతో వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభించారు. వేరేశాఖ పనులను నగరపాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తుందని విమర్శలు రావటంతో ప్రారంభించిన మరుసటి రోజే టెండర్ రద్దు చేసుకొని పనులను నిలిపివేశారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ మురుగునీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడవడం, వ్యర్థాలు తొలగిస్తామని చెప్పి మళ్లీ రద్దు చేసుకోవటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

నగర పాలక సంస్థ కాల్వలో వ్యర్థాలు తొలగించటానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. మరుసటి రోజే టెండరు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. కాలువలోకి మురుగు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పంటలకు సక్రమంగా నీరందటం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. సంతోశ్, డీఈ, ఎస్సారెస్పీ, కరీంనగర్

# సిబ్బంది ఇష్టారాజ్యం

ధర్మపురి : పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఏటా రూ.10 కోట్ల ఆదాయం సమకూరుతున్నా.. భక్తులకు ఎలాంటి వసతులు కల్పించడం లేదు. ఆలయంలో దశాబ్దాలుగా బదిలీలు లేని సిబ్బందితోపాటు ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. దీనిపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి.. ఆలయ అంతర్గత వ్యవహారాలపై దృష్టి సారించడంతోపాటు, నిలిచిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

**వీఐపీలకే అధిక ప్రాధాన్యం..**

ఆలయంలో సామాన్య భక్తులకు సేవలు భారంగా మారాయి. వీఐపీలకు, సిబ్బంది పరిచయస్తులకు ఇస్తున్న ప్రాధాన్యం.. సామాన్యులకు ఇవ్వడం లేదు. దేవస్థానంలోని కొందరు సిబ్బంది, రక్షణ గార్డులు కుమ్మక్కై దర్శనానికి సంబంధించి అవకతవకలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో.. భక్తులకు సదుపాయాలపై శ్రద్ధ పెట్టడం లేదని తెలుస్తోంది. గతంలో బయోమెట్రిక్ విధానాన్ని రూపొందించినా.. అనంతరం యంత్రాలు మూలన పడ్డాయి. మరోవైపు ఆలయంలో జరిగిన వివాదాస్పదన ఘటనలను సీసీ కెమెరాల రికార్డుల నుంచి సిబ్బంది తొలగిస్తున్నారని.. కేవలం స్వీయ రక్షణకే ఇవి ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలున్నాయి.

**సామగ్రి లెక్కల్లో తేడాలు..**

ఆలయానికి వెనుకవైపు ద్వారం ఉండగా.. లోనికి ఎవరు వస్తున్నారనే దానిపై దృష్టి నిలపడం లేదు. దీంతో భక్తులు ఆలయ రక్షణపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ద్వారం నుంచి ఆలయానికి చెందిన సరుకులు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఆకస్మికంగా గతేడాది తనిఖీ చేయగా పలు లోపాలు బయటపడ్డాయి. రిజిస్టర్‌లో నమోదైన వాటికి.. నిలువ ఉన్న సరుకులకు, బియ్యానికి భారీ తేడా ఉందని కమిషనర్ తన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే నివేదిక ఆధారంగా



తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు విస్మరించారు. వెనుక ద్వారాన్ని పూర్తిగా మూసివేయాలని పోలీసులు సూచించినా.. ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

ఆలయంలో ఉదయం అభిషేకం, హోమం, నిత్య కళ్యాణోత్సవం, విశేష అర్చనలు ఇలా ప్రతి దానిలోనూ భక్తులకు సేవలు భారంగా మారుతున్నాయి. టికెట్ల ధరలను పెంచినా.. పూజల అనంతరం పలువురు డబ్బులు పుచ్చుకుంటున్నారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం భక్తుల నుంచి డబ్బులు ఆశించరాదు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆలయ ప్రాంగణంలోని దుకాణదారులు సామగ్రిని ఇష్టారాజ్యంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ఏళ్ల తరబడి బదిలీలు లేవు**

ఓ వైపు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో ఉద్యోగులు బదిలీ అయ్యారు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మాత్రం ఒక్కో సిబ్బంది ముప్పై ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. రెగ్యులర్, తాత్కాలిక సిబ్బంది కలిపి మొత్తం 50 మంది వరకు ఉన్నారు. వీరిలో కొంతమంది డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయిదు లేదా ఆరుగురు బదిలీ కావచ్చని అధికారులే భావించినా.. చివరికి ఎవరూ కాకపోవడం గమనార్హం.

**లోపాలను సవరిస్తాం**

దేవస్థానంలో లోపాలను సవరించి, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం. భక్తులకు సేవలు భారంగా కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆలయంలో పని చేసే సిబ్బందిపై పూర్తిస్థాయిలో నిఘా పెడుతున్నాం. సంకటాల శ్రీనివాస్, ఈవో

# ఆక్రమణల పర్వం.. చర్యలకు రంగం సిద్ధం

గోదావరిఖని : సింగరేణికి సంబంధించిన విలువైన భూములు, నివాస గృహాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని రక్షించుకోవడానికి సంస్థ సిద్ధమవుతోంది. ఇప్పటివరకు సింగరేణికి చెందిన వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. పారిశ్రామిక అవసరాలకు ప్రభుత్వం, ప్రైవేటు వారినుంచి సేకరించిన లక్షల ఎకరాల భూములు హద్దులు లేకుండా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో వాణిజ్య కేంద్రాలు ఉండటంతో.. అక్కడివారు ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో ముందుకు.. సింగరేణికి చెందిన భూములు, నివాస గృహాలను కాపాడుకోవడానికి హైడ్రా తరహాలో చర్యలు తీసుకోవడానికి సంస్థ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో చెరువులను కబ్జా చేసి, చేపట్టిన భవనాలను ఏ విధంగా కూల్చివేశారో.. అదే మాదిరిగా ఇక్కడ తొలగించేలా పరిశీలిస్తుంది. గోదావరిఖని నడిబొడ్డున ఉన్న సింగరేణి స్థలాన్ని ఆక్రమించుకుని వాణిజ్య భవనాలు నిర్మించారు. దీనిపై సంస్థకు, నిర్మాణాలు చేపట్టినవారికి మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది. ఇదే స్థలంలో గతంలో సంస్థకు చెందిన నిర్మాణాలుండేవి. వాటిని కూల్చివేసిన అనంతరం ప్రైవేటు వ్యక్తులు అవి తమ భూములని అందులో నిర్మాణాలు చేపట్టారు. అలాగే బెల్లంపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో కూడా వాణిజ్య భవనాలు నిర్మించుకున్నారు. దీనిపై సింగరేణి సీఎండీ బలరాం.. ప్రత్యేకంగా అధికారుల సమీక్షలో దీనికి సంబంధించిన వాటిపై చర్చించారు. వీటన్నింటినీ పరిరక్షించుకోవడానికి ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంది.

**నివాస గృహాలపై అయోమయం..**

మరోవైపు సింగరేణి క్వార్టర్లకూ రక్షణ లేకుండా పోయింది. కొత్తగూడెం, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల్లోని చాలావరకు సంస్థ నివాస గృహాలను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని నివసిస్తున్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన



మరికొంతమంది స్వాధీనం చేసుకుని.. సంస్థకు సంబంధం లేకుండా వినియోగించుకుంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా సంస్థకు 55 వేల నివాస గృహాలున్నాయి. కొత్తగా భూపాలపల్లి, సత్తుపల్లి ప్రాంతాల్లో ఉద్యోగుల కోసం క్వార్టర్లు నిర్మించింది. ఇవి కాకుండా సింగరేణి ఆవిర్భావ సమయంలో నిర్మించిన కొన్ని క్వార్టర్ల వివరాలు సంస్థ వద్ద లేకుండా పోయాయి. అందులో ఎవరు నివాసం ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరువలో.. సింగరేణికి చెందిన చాలావరకు నివాస గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం కార్మికులు తక్కువగా ఉండటంతో.. గతంలో నిర్మించిన క్వార్టర్లలో ఎవరూ నివాసం ఉండటం లేదు. దీంతో అవి నిర్వహణకు నోచుకోకపోవడంతో తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. గోదావరిఖని, బెల్లంపల్లి, మందమర్రి, కొత్తగూడెం ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. వాటిని సైతం గుర్తించి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు.

# అతివలకు శిక్షణ.. ఆదాయానికి రక్షణ



సిరిసిల్ల : జిల్లా మహిళలు నేడు ప్రపంచశ్రేణి దుస్తుల తయారీలో కీలకంగా మారుతున్నారు. గార్మెంట్ రంగంలో నైపుణ్యం ఉన్న మహిళలకు పెద్దూరులోని అపరెల్ పార్కు ఉపాధికి నెలవుగా మారింది. ఆదాయ మార్గం అవుతుంది. ఇందులోని రెండో యూనిట్‌లో వచ్చే నెల నుంచి ఉత్పత్తులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

బెంగళూరుకు చెందిన జౌళి పారిశ్రామిక సంస్థ టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ (టీఐపీఎల్) 2022 ఫిబ్రవరి 26న ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనికి ప్రభుత్వం ఏడు ఎకరాల విస్తీర్ణంలో రూ.46 కోట్లతో ప్లగ్‌అండ్ ప్లేలో నిర్మాణాలు, మౌలిక వసతులు సిద్ధం చేసి ఇచ్చింది. తొలి విడత రూ.18 కోట్ల పెట్టుబడితో యంత్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. దీనిలో పని చేసేందుకు మహిళల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రవేశ పరీక్ష, శిక్షణ తర్వాత నవంబరులో ఉత్పత్తులు ప్రారంభించనున్నారు. చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో జూకీ మిషన్లపై శిక్షణ పూర్తి చేసుకున్నవారి వివరాలు సేకరించారు. వారిలో ఆసక్తి ఉన్నవారికి వచ్చే వారం రోజుల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. దీనిలో అర్హులైన 120 మందికి తొలి విడత టీఐపీఎల్ సొసైటీ నుంచి కంపెనీ ఉత్పత్తులపై నెల రోజులు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. దీనిలో అర్హత సాధించిన వారికి కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఇలా విడతల వారీగా వెయ్యి మందికి శిక్షణ ఇస్తారు. వెయ్యి జూకీ మిషన్లపై రెండు షిఫ్టుల్లో రెండు వేల మందికి ఉపాధి లభిస్తుంది.

ఈ పార్కులోని తొలి యూనిట్ గ్రీన్‌నిడిల్ సంస్థ ఉత్పత్తులను గతేడాది న్యూయార్క్ నగరానికి ఎగుమతి చేసింది. టీఐపీఎల్‌లో ఉత్పత్తి అయ్యే చొక్కాలు, ప్యాంట్లు, టీషర్టులు, జాకెట్, కోట్స్ కూడా పూర్తిగా ఎగుమతి రకాలు. ఈ రెండు కంపెనీలకు ముడిసరకుగా ఉపయోగించే వస్త్రాన్ని పూర్తిగా బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

అపరెల్ పార్కులో దుస్తుల తయారీ పరిశ్రమల కోసం నాలుగేళ్లుగా టెక్స్‌టైల్ పార్కులో రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి ఉపకార వేతనంతో మహిళలకు పది రోజుల శిక్షణ ఇస్తోంది. ఇప్పటికే 3,385 మంది శిక్షణను పూర్తిచేసుకున్నారు. వీరిలో కొందరు సొంతంగా ఉపాధి పొందుతుండగా, 300 మంది తొలి యూనిట్ గ్రీన్‌నిడిల్ కంపెనీలో పని చేస్తున్నారు. ప్రస్తుతం రెండో యూనిట్‌కు విడతల వారీగా వెయ్యి మంది మహిళలు అవసరం.

నైపుణ్యాలను బట్టి ఉపాధిడిగ్రీ పూర్తయ్యాక ప్రైవేటు సంస్థల్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేశాను. అందులో సరైన వేతనం లేక ఇబ్బందిగా మారింది. స్థానికంగా అపరెల్ పార్కులో కంపెనీలు వస్తున్నాయి. ఉత్పత్తుల్లో నైపుణ్యం, విద్యార్హతను బట్టి ఉపాధి లభిస్తుందని ఈ రంగంలో శిక్షణ తీసుకున్నాను. బి.స్వప్న, తంగళ్లపల్లి

అనుభవం ఉన్న రంగంలో...మా గ్రామంలో పదేళ్లుగా కుట్టు శిక్షణతో ఉపాధి పొందుతున్నాను. దీనిలో ఏడాదంతా పని ఉండేది కాదు. దీంతో వ్యవసాయ పనులకు సైతం వెళుంటాను. ఇప్పటికే పని చేసిన అనుభవం ఉండటంతోపాటు ఇక్కడ జూకీ మిషన్లపై శిక్షణ తీసుకున్నాను. నచ్చిన రంగంలో ఉపాధితో స్థిరపడాలని అనుకుంటున్నాను. డి.రేఖ, రామన్నపేట

# రాజకీయ జోక్యంపై నల్లనేలలో వాడీవేడి చర్చ

కొత్తగూడెం : సింగరేణిలో రాజకీయ జోక్యంపై వాడీవేడి చర్చ జరుగుతోంది. కార్మిక సంఘాలు ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. కోల్‌బెల్ట్‌లోని ప్రజాప్రతినిధులు సింగరేణి అధికారులపై ఒత్తిళ్లు తీసుకురావడం కొన్నేళ్ల క్రితం అంతగా లేదు. ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నది కార్మిక సంఘాల వాదన.

గతంలో సింగరేణిలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఉండేవారు. కీలక విభాగాలను పర్యవేక్షించేవారు. వారిలో ఒకరు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఆ తర్వాత అంతటి ప్రాధాన్యం గల మరో పోస్టు.. డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ (పా). వీరు కాకుండా ఆర్థిక విభాగం (ఫైనాన్స్) సంచాలకుడిగానూ మరో ఐఆర్ఎస్ స్థాయి అధికారి విధులు నిర్వర్తించేవారు. వీరి కనుసన్నల్లో నిర్వహణ కొనసాగుతుండగా, ఇదే క్రమంలో సంస్థలో రాజకీయ జోక్యం చాలా పరిమితంగా కనిపించేదని సీనియర్ కార్మిక నాయకులు గుర్తుచేస్తున్నారు. దశాబ్ద కాలంగా ఈ పరిస్థితులు క్రమంగా మారుతూ వచ్చాయన్నది సంఘాలు, కార్మికుల తాజా ఆరోపణ. ఈ పరిణామాల నేపథ్యంలో డైరెక్టర్(పా) పోస్టులో ఐఏఎస్ అధికారిని తొమ్మిదేళ్లుగా నియమించడం లేదు. పరిపాలనా పరమైన అంశాలను ఇతర డైరెక్టర్లు అదనంగా చూడటం, అధికారాలన్నీ సీఎండీల వద్దే కేంద్రీకృతం కావడం వంటివి ప్రస్తుతం నెలకొన్న ధోరణులు. ఇదే క్రమంలో సంస్థపరమైననిర్ణయాలపై రాజకీయ ప్రభావం ఎంతో ఉంటోందని కొన్ని సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

**డైరెక్టర్(పా) కొనసాగుతారా?**

ఓ ప్రజాప్రతినిధి ఫోన్‌ను ఎత్తనందుకు గతంలో ఒక ముఖ్యవైద్యాధికారిని ఆ పోస్టులోంచి మార్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇదే తరహాలో ఏరియాల్లో పలువురు అధికారులు వృత్తిపరమైన ఒత్తిళ్లు తట్టుకోవాల్సి వస్తోంది. కొందరు లౌక్యంగా వీటిని ఎదుర్కొంటుంటే.. మరికొందరు ముక్కుసూటిగా వెళ్లి ప్రజాప్రతినిధుల ఆగ్రహానికి గురవుతున్నారు. తాజాగా డైరెక్టర్(పా) వైఖరి నచ్చని కొందరు ప్రజాప్రతినిధులు కొద్దిరోజులుగా సంస్థ సారథి వద్ద అసంతృప్తి వెళ్లగక్కుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సదరు డైరెక్టర్(పా) విదేశీ పర్యటనకు వెళ్లడం చర్చనీయాశంగా మారింది. పర్యటన అనంతరం తిరిగి వచ్చాక ఆయన్నే ఆ పోస్టులో కొనసాగిస్తారా? లేక ఆయన స్థానంలో వేరొకరికి బాధ్యతలను అప్పగిస్తారా? అనే ఉత్కంఠ కార్మిక సంఘాల్లో నెలకొంది.



## కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఫైర్.. వరుస ట్వీట్లతో ధ్వజం

దిల్లీ: మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆర్థికంగా చేయగలిగే హామీలు మాత్రమే ఇవ్వాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమ పార్టీ శాఖలకు సూచించిన నేపథ్యంలో ప్రధాని తనదైన శైలిలో స్పందించారు. "బూటకపు వాగ్దానాలు చేయడం సులభమే.. కానీ, వాటిని అమలు చేయడం కష్టం లేదా అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ గ్రహిస్తోంది" అని 'ఎక్స్'లో వరుస పోస్టులు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేమని వారికి తెలిసినా ప్రచారంలో ఊదరగొట్టారని.. ఇప్పుడేమో ప్రజల ముందు ఘోరంగా నిలబడ్డారని పేర్కొంటూ చ%ఖ్ఱివవూతీశీఎఱంవయాటజశీఅస్త్రతీవం% అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాన్ని చూసినా.. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో అభివృద్ధి కుంటుపడిందని.. ఆర్థిక పరిస్థితి దిగజారిందని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమంటే.. ప్రజల్ని మోసగించడమేనన్నారు. ఇలాంటి రాజకీయాలతో పేదలు, యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నిరాకరించడమే కాకుండా.. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను సైతం నీరుగార్చేలా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ బూటకపు హామీల సంస్కృతిపై దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హరియాణా ప్రజలు కాంగ్రెస్ నేతల బూటకపు హామీలను ఎలా తిరస్కరించారో ఇటీవలే అందరమూ చూశామన్నారు. అక్కడి ప్రజలు సుస్థిరత, అభివృద్ధితో నడిపించే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారన్నారు. కాంగ్రెస్‌కు వేసే ఓటు పాలనా రహితం, అసమానమైన దోపిడీకి దారితీస్తుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు.

దేశ ప్రజలు అభివృద్ధి, ప్రగతిని కోరుకుంటున్నారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలు, దోపిడీలో బిజీగా ఉందంటూ ప్రధాని మోదీ మండిపడ్డారు. అక్కడ ఇప్పటికే ఉన్న పథకాలను సైతం ఉపసంహరించుకుంటున్నారన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడంలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. అలాగే, గతంలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కొన్ని అలవెన్సులు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఐదేళ్ల పాటు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ఎలా పనిచేస్తుందో చెప్పేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు.

## ఏలూరులో పేలుడు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పార్థసారథి



ఏలూరు: ఏలూరులో బాణసంచా తీసుకెళ్తుండగా భారీ పేలుడు సంభవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పరామర్శించారు. ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. దీపావళి పండగ పూట ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు.

పార్టీ తరఫున రూ.లక్ష, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, మృతుడు భార్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

## అబద్ధాల్లో జగన్‌కి ఆస్కార్ ఇవ్వొచ్చు: మంత్రి నిమ్మల రామానాయుడు




అమరావతి: అబద్ధాల్లో జగన్‌కి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. పోలవరం ఎత్తుపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని మోసం చేసి.. జగన్ ఛీత్కారానికి గురయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజా జీవనంలో ఉండడానికి అర్హత లేదన్న విషయం జగన్‌కు అర్థమైందని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ధ్వజమెత్తారు. పోలవరం ఎత్తుపై అతని మీడియాలో అబద్ధాలు అచ్చు వేసి గడిచిన రెండ్రోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను పూర్తి వివరాలతో జగన్ పోలవరం ప్రాజెక్టుకు చేసిన ద్రోహం గురించి వివరించానన్నారు. అయినా అతని బుద్ధి మారలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి జల ద్రోహం చేసింది జగన్ కుటుంబమేనని ఆరోపించారు. నాడు జల యజ్ఞంపేరిట ధనయజ్ఞం చేశారని, కృష్ణా మిగులు జలాల్లో హక్కు కోరబోమని బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్‌కు లేఖ రాసి ఇచ్చి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం రివర్స్ టెండరింగ్ పేరుతో 15 నెలలు ఆలస్యం చేసి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి కారకులయ్యారన్నారు. ఇసుక మాఫియాతో అన్నమయ్య డ్యామ్‌ను కూలగొట్టి 38 మంది ప్రాణాలు బలిగొన్నారని మండిపడ్డారు. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవడం జగన్ పాపం కాదా? అని ప్రశ్నించారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన రూ.3,800 కోట్లు దారి మళ్లించి నదుల అనుసంధానానికి గండి కొట్టారని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించడానికి రెండు ఫేజ్‌లుగా విభజించింది జగన్ కాదా అని నిలదీశారు. 41.15 మీటర్లకు తగ్గించాలని కేంద్రం అనుమతి కోరింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. ఎన్డీయే ప్రభుత్వం పోలవరం ఎత్తు 45.72 మీటర్లకు పెంచి నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేస్తుందని తెలిపారు.

## దోచుకున్న ఆస్తులు కాపాడుకునేందుకే జగన్ తాపత్రయం: గంటా



విశాఖపట్నం: దోచుకున్న ఆస్తులు కాపాడుకునేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ తాపత్రయ పడుతున్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆ పార్టీ మునిగిపోయిన నావ అని.. ఒకరిద్దరు కూడా అందులో మిగలరని చెప్పారు. విశాఖపట్నంలోని తన నివాసంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. వాలంటీర్లు లేకుండా పింఛన్ల పంపిణీ సాధ్యం కాదన్న వైకాపా నేతలు ఇప్పుడు చూస్తున్నారా?అని వ్యాఖ్యానించారు.

"భవిష్యత్తులో అన్న క్యాంటీన్లలో భోజనం ఉచితంగా అందించే ఆలోచన ఉంది. అధ్వాన రోడ్లపై దృష్టి పెట్టాం.. అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నాం. విశాఖకు మరిన్ని ఐటీ కంపెనీలు వచ్చేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. నగర అభివృద్ధిపై శనివారం సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తారు. స్టీల్‌ప్లాంట్ అంశంలో చిత్తశుద్ధితో ఉన్నాం" అని గంటా శ్రీనివాసరావు అన్నారు

## ఆ పని ఎన్నికల సంఘం అద్భుతంగా చేస్తోంది: కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. తన స్వతంత్రతను పూర్తిగా పక్కనపెట్టడమే లక్ష్యమైతే.. ఆ విషయంలో ఎన్నికల సంఘం అద్భుతమైన పనితీరు చూపుతోందని మండిపడింది. ఈ మేరకు లేఖ రాసింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. భాజపా అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా.. ఈసీ తోసిపుచ్చింది. "తమకు అనుకూల ఫలితాలు రానప్పుడు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తుంటుంది" అని విమర్శించింది. ఆ ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని తోసిపుచ్చింది. హరియాణా ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని, ఇలాంటి పనికిమాలిన ఫిర్యాదులు చేసే ధోరణిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎన్నికల సంఘం తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకోవడం తమనేమీ ఆశ్చర్యపర్చలేదని కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం%) వ్యాఖ్యానించింది. అయితే సమాధానం ఇచ్చిన తీరు, వాడిన భాష, పార్టీపై చేసిన ఆరోపణలు తాము తిరిగి లేఖ రాసేందుకు కారణమయ్యాయని వ్యాఖ్యానించింది. ఈసీ ఇదే తరహా భాషను ఉపయోగిస్తూ ఉంటే.. అలాంటి వ్యాఖ్యలను తొలగించేందుకు న్యాయపరమైన ఆశ్రయం పొందడం మినహా తమకు మరో మార్గం లేదంటూ ఆ లేఖలో తీవ్రంగా స్పందించింది.




## మన చినాబ్ వంతెనపై పాక్ కన్ను.. చైనా కోరిక మేరకేనట..!

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పొరుగుదేశం పాకిస్థాన్ కన్నేసినట్లుగా ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొన్నట్లు పలు మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని రైసీ, రామబాణ్ జిల్లాల మధ్య నిర్మిస్తున్న ఈ వంతెనకు సంబంధించిన వివరాలు సేకరించమని చైనా పాకిస్థాన్‌ను కోరడంతో ఆ దేశ ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ బ్రిడ్జి గురించిన కీలకమైన విషయాలు తెలుసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారనే విషయంపై స్పష్టత లేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వేవంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన విషయం తెలిసిందే.

దీని నిర్మాణం పూర్తిచేయడానికి ప్రభుత్వానికి 20 ఏళ్లు పట్టింది. ఇటీవల ఈ వంతెనపై తొలి రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఉధంపుర్-శ్రీనగర్- బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున ఉన్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు.




ఓవైపు ఆధ్యాత్మిక బోధనలు.. ఇంకోవైపు వ్యక్తిత్వ వికాస స్పీచ్‌లు.. ఆధ్యాత్మిక పథంలో నయా ట్రెండ్ సెట్ చేస్తున్నారు జయా కిశోరి. ఇప్పుడీ పేరు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది! ఆధ్యాత్మిక ప్రవచనకర్తగా పేరొందిన ఈమె.. ఇటీవల ఓ విమానాశ్రయంలో రూ.2 లక్షల విలువైన 'డియోర్' చేతి సంచిని ధరించి విమర్శల పాలయ్యారు. ఇంతకీ ఎవరీ జయా కిశోరి? ఆమె ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే.. ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇస్తున్నారంటే.. ఎవరో పెద్ద వయసు ఉన్నవారేమో అనుకుంటుంటాం! కానీ జయా కిశోరి వయసు కేవలం 29 ఏళ్లే. 1995 జులైలో రాజస్థాన్‌లోని సుజన్‌గఢ్‌లో జన్మించారు. తన కుటుంబం మార్గదర్శకత్వంలో ఏడేళ్ల ప్రాయంలోనే ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభించారు.

భక్తి పాటలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో లక్షలాది మందిని ఆకర్షించి 'అభినవ మీరాబాయి'గా గుర్తింపు పొందారు. మహాదేవి బిర్లా వరల్డ్ అకాడమీలో విద్యనభ్యసించిన జయా కిశోరి.. తన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూనే కోల్‌కతాలోని శ్రీ శిక్షాయతన్ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ పట్టా అందుకున్నారు. చిన్నారుల ప్రదర్శన 'బూగీ వూగీ'లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. దాదాపు 20కి పైగా ఆధ్యాత్మిక ఆల్బమ్స్ ఆలపించారు. శివ స్తోత్ర, సుందర్‌కాండ్, లగన్ తుమ్సే లగా అండ్ ఠాకూర్ జీ కా మేలా వంటి భజనలతో అభిమాన శ్రోతలను సంపాదించుకున్నారు. అన్ని వయసుల వారు కనెక్ట్ అయ్యేలా సందేశాలు ఇవ్వగలగడం జయా కిశోరి ప్రత్యేకత. మనిషి విజయంలో కీలక పాత్ర పోషించే సహనం, స్థిరత్వం, ప్రశాంత చిత్తం వంటి ప్రధాన అంశాల గురించి తరచూ ప్రసంగాల్లో ప్రస్తావిస్తుంటారు. ఆమె ప్రసంగాల్లో ప్రధానంగా నాలుగు అంశాలపై ఫోకస్ ఉంటుంది. శ్రీమద్ భగవద్గీతలోని పాఠాలు, నిజ జీవితంలో సాగే వ్యక్తిగత కథలుబీ కుటుంబ విలువల ప్రాముఖ్యతబీ విభిన్న అనుభవాలు, దృక్కోణాల నుంచి నేర్చుకోవడం వంటి అంశాల ఆధారంగానే బోధిస్తుంటారు. ఆధ్యాత్మికత, స్ఫూర్తిదాయక ప్రయాణంలో జయా కిశోరి ప్రభావవంతమైన కృషికి అనేక అవార్డులు, సత్కారాలు లభించాయి. ఆదర్శ యువ ఆధ్యాత్మిక గురు పురస్కారం, సమాజ్ రతన్ అవార్డులు వరించాయి. సంస్కార్ ఛానల్ 'ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'తో గౌరవించింది. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. భాగవతం, భగవద్గీత, మహాభారతంపై ఆమె ప్రవచనాలకు యూట్యూబ్‌లో చక్కటి ఆదరణ ఉంది. పెద్ద సంఖ్యలో ఫాలోవర్లు ఉండటంతో ఆమె చెప్పే స్ఫూర్తిదాయకమైన మాటలు గంటల్లోనే వైరల్ అవుతుంటాయి.

## త్వరలోనే రెడ్‌బుక్ మూడో చాప్టర్: నారా లోకేశ



అట్లాంటా: రెడ్‌బుక్‌లో రెండు చాప్టర్లు ఓపెన్ అయ్యాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. "చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం. సందేహం లేదు.. త్వరలోనే రెడ్‌బుక్ మూడో చాప్టర్ కూడా తెరుస్తాం. యువగళం పాదయాత్రలో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. రెడ్‌బుక్‌కు భయపడుతున్న జగన్.. గుడ్‌బుక్ తీసుకొస్తానంటున్నారు. బుక్‌లో ఏమి రాయాలో ఆయనకు అర్థం కావట్లేదు. గతంలో సోషల్‌మీడియాలో పోస్టు పెడితే కేసులు పెట్టి లుకౌట్ నోటీసులు ఇచ్చేవారు. నోటీసులకు భయపడకుండా ఎన్ఆర్ఐలు నిలబడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రానికి పెట్టుబడులు కూడా తీసుకెళ్లాలి. సంక్షేమం అంటే ఏమిటో ఎన్టీఆర్ చూపించారు. ప్రపంచంలో తెలుగువారు తలెత్తుకొని తిరిగే పరిస్థితి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎప్పుడూ ముందుంటాం. మీరు ఎన్ఆర్ఐలు కాదు.. ఎంఆర్ఐలు అని పిలుస్తా. ఎంఆర్ఐ అంటే 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్' అని అర్థం. ఏపీలో కూటమి గెలుపు ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క తెలుగువారిది" అని లోకేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, ఎన్ఆర్ఐ తెదేపా నేత కోమటి జయరాం పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సమయంలో అభిమానులు హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపించారు.

**'ఫ్యూచర్ సీఎం ఆఫ్ ఏపీ' అంటూ మంత్రి లోకేశ్‌కి ప్రవాసాంధ్రుల వీడ్కోలు :**

అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తిచేసిన మంత్రి నారా లోకేశ్‌కు ప్రవాసాంధ్రులు అపూర్వంగా వీడ్కోలు పలికారు. తొలిరోజు ఘనంగా స్వాగతించినట్లే.. తిరుగు పయనంలో ఆత్మీయత, అభిమానం చాటుకున్నారు. 'ఫ్యూచర్ సీఎం ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంటూ ప్రైవేట్ జెట్‌కు బ్యానర్ కట్టారు. విమానం గాల్లోకి ఎగరగానే బ్యానర్‌పై రాసిన సందేశం స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేశారు.

## మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ


తాడేపల్లి: వైకాపా మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై విజయవాడకు చెందిన మహిళ తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజుకు ఫిర్యాదు చేశారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.90 లక్షలు తీసుకొని మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఇవ్వాల్సిన డబ్బును అడిగితే.. 'విశాఖలో గిరిజన టీచర్‌ను స్లో పాయిజన్ ద్వారా చంపేశాన ని, నీకు అదే గతి పడుతుందని' నాగార్జున వ్యక్తిగత సహాయకుడు మురళీ బెదిరిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. తనకు రావాల్సిన రూ.90 లక్షలను ఇప్పించాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.






## లేడీ సూపర్ స్టార్ పర్సనల్ లైఫ్ ని టచ్ చేస్తున్నారా?


ఎంటర్ టైన్ మెంట్ ట్రెండ్ మారిన తరుణం ఇది. సినిమాల్ని మించి వండర్స్ ని నెట్ ఫ్లిక్స్ క్రియేట్ చేస్తోంది. వెబ్ సిరీస్ లు..డాక్యుమెంటరిలతో సినిమాల్ని మించిన ఎంటర్ టైన్ మెంట్ అందిస్తున్నాయి. బయోపిక్ ల్ని డాక్యు మెంటరీల రూపంలో తీసుకొచ్చి మంచి సక్సెస్ అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రెండింగ్ సెలబ్రిటీల కథలు సైతం వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలే దేశం గర్వించ దగ్గ దర్శకుడు రాజమౌళిపై డాక్యుమెంటరీ రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా లేడీ సూపర్ స్టార్ నయనతారపై 'బియాండ్ ది ఫెయిరీ టైల్' పేరుతో ఓ స్పెషల్ ఎపిసోడ్ రిలీజ్ అవుతుం ది. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఇందులో నయనతార కథని చెప్పబోతున్నారు. అయితే ఈ కథని ఎంత వరకూ తీసుకున్నారు?




అన్నది తెలియాలి. అన్ని విషయాలు ఓపెన్ గా కుదించి చెబుతున్నారా? లేక కొంత వరకూ పరిమితం చేస్తున్నారా? అన్నది చూడాలి. నయనతార ఇండస్ట్రీలో ఎలా ఎదిగింది అన్నది తెలిసిందే. చిన్న పాత్రతో నటిగా పరిచయమై హీరోయిన్ అయింది. అటుపై లేడీ సూపర్ స్టార్ గా ఎదిగింది. వ్యక్తిగత జీవితంలో నూ ఎన్నో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. విగ్నేష్ కంటే ముందు ఆమె పలువురి నటులతో ప్రేమాయ ణాలు అప్పట్లో ఓ సంచలనం. అలాగే సినిమా ప్రచార కార్యక్రమాలకు హాజరు కాదు అనే రిమార్క్ అమ్మడిపై ఉంది. ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా ప్రమోట్ చేయదనే విమర్శ చాలా కాలంగా ఎదుర్కుంటుంది. ఇండస్ట్రీలో ఎంతో మంది లేడీ సూపర్ స్టార్లు ఉన్నా? నయన్ మాత్రం వాళ్లకు భిన్నమైన మార్గంలో వెళ్తుంది. ప్రచార పరంగా ఎందుకు పాల్గొనదు? అన్నది తనకి మాత్రమే తెలిసు. అందులో లాభనష్టాల్ని తాను మాత్రమే బేరీజు వేసుకుని ప్రయాణం సాగిస్తుంది. మరి ఇలాంటి అంశాలు బియాండ్ ది పెయిర్ లో చెబుతున్నారా? లేదా? అన్నది చూడాలి.

## టబు గౌన్ తయారీకి నెల రోజులు?

హాలీవుడ్ వరల్డ్‌లో సీనియర్ నటి టబు పాపులారిటీ అంతా ఇంతా కాదు. ఆంగ్ లీ తెరకెక్కించిన ఆస్కార్ విన్నింగ్ మూవీ లైఫ్ ఆఫ్ పై సహా పలు హాలీవుడ్ చిత్రాల్లో టబు నటించారు. ఇప్పుడు అమెరికన్ టీవీ సిరీస్ - డూన్ ప్రొఫెసీస్‌లోను టబు నటించింది. ఇంతకుముందు విడుదలైన ట్రైలర్ లో టబు మెరుపులా కనిపించి ఆకట్టుకుంది. ఇప్పుడు న్యూయార్క్‌లో %ఎదీూ% డూన్: ప్రొఫెసీ వరల్డ్ ప్రీమియర్‌కు టబు హాజరయ్యారు. భారతీయ డిజైనర్లు అబూ జానీ సందీప్ ఖోస్లా కస్టమ్-మేడ్ చేసిన బ్లాక్ కోచర్ గౌనులో టబు షో స్టాపర్ గా నిలిచారు. ఫ్యాషన్ డిజైనర్స్ కి చెందిన ఇన్‌స్టాగ్రామ్ పేజీ డైట్ సబ్య ప్రపంచ ప్రీమియర్ నుండి టబు వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోకి రెవరెండ్ మదర్ టబు అని వ్యాఖ్యను జోడించింది. ఈ కస్టమ్ మేడ్ గౌను తయారు చేయడానికి ఒక నెల



పట్టిందని టబు వెల్లడించారు. అబు జానీ, సందీప్ ఖోస్లాను భారతదేశంలో అత్యంత పాపులర్ డిజైనర్లు అని అభివర్ణించారు. నేను వారిని ప్రేమిస్తున్నాను అని టబు అన్నారు. డూన్: ప్రొఫెసీ ప్రీమియర్ థీమ్ కి తగ్గ డిజైనర్ గౌన్ ఇది. ప్రొఫెసీ లుక్‌ని డీకోడింగ్ చేస్తూ డిజైనర్లు రూపొందించారు. అబు జానీ సందీప్ ఖోస్లా కస్టమ్ బ్లాక్ గౌను ప్రత్యేకత ఏమిటీ అంటే.. ఒక క్లాసిక్ అంగ్రాఖాను తిరిగి రూపొందించే ఒక రకమైన కోచర్ పీస్. డైట్ సబ్య ప్రకారం.. ఇది స్వచ్ఛమైన ఖాదీ సిల్క్‌తో తయారు చేసినది. 38 సంవత్సరాల క్రితం కనుగొన్న ఒక రహస్య ఆర్టిసానల్ సిగ్నేచర్ టెక్నిక్ ద్వారా సృష్టించిన ఆకృతి గల గౌను. ఆఫ్-షోల్డర్ ప్లంగింగ్ నెక్‌లైన్, ఫుల్-లెంగ్త్ స్లీవ్‌లు, బస్ట్ కింద సిన్చ్డ్ సిల్హౌట్.. ఫ్లోర్ స్కర్ట్‌తో పాటు ఫ్లోర్-లాంగ్ డిజైన్... డూన్: ప్రొఫెసీటీవీ సిరీస్ నవంబర్ 18 నుండి జియో సినిమాలో ప్రసారం కానుంది. ఈ సిరీస్‌లో సిస్టర్ ఫ్రాన్సిస్కా పాత్రలో టబు కనిపించనుంది. ఇది తిమోతీ చలమెట్ డూన్: పార్ట్ వన్‌కు ప్రీక్వెల్.

## మాస్ జాతర.. లుక్కు అదిరింది రాజా



మాస్ మహారాజా రవితేజ 75వ చిత్రానికి "మాస్ జాతర" అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం, రవితేజ కెరీర్ లోనే ఒక సరికొత్త ట్రెండ్ సెట్ చేయనున్నట్లు తెలుస్తోంది భాను భోగవరపు రచయితగా, దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను మొదట సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నారు. కానీ మధ్యలో షూటింగ్ కి బ్రేక్ రావడంతో ప్లాన్ మారింది. 2025 మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ అభిమానులను ఉర్రూతలూగించింది. జాతరల హడావిడి నేపథ్యంగా దీపావళి సంబరాలను తలపిస్తూ రవితేజ స్టైలిష్ గా, తుపాకీ పట్టుకుని నడుచుకుంటూ వస్తున్న లుక్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ లో ఉన్న ఎఫెక్ట్స్ రవితేజ పట్ల క్రేజ్‌ని మరింత పెంచాయి. జాతర నేపథ్యంలో టపాసుల వెలుగులు, అల్లరిమూకతో చుట్టూ ఉన్న ఆ ఫైర్ ఎలిమెంట్స్ పోస్టర్ లో సినిమాటిక్ గ్రాండియర్ ని సూచిస్తున్నాయి. రవితేజ - శ్రీలీల కాంబినేషన్ గతంలో "ధమాకా"తో సూపర్ హిట్ అందుకుంది. ఇప్పుడు "మాస్ జాతర" లో ఈ జంట మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు భాను భోగవరపు ఈ సినిమా గురించి చాలా నమ్మకంగా ఉన్నారు. "మాస్ జాతర" కథకు రవితేజ టైమింగ్, యాటిట్యూడ్ అద్భుతంగా సరిపోతాయట. ఇక ఈ సినిమా వినోదాన్ని మరియు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ని పటిష్టంగా అందించేందుకు చిత్ర బృందం కృషి చేస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, విధు అయ్యన్న సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపడుతున్నారు. ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా మాస్ ప్రేక్షకులకు అసలైన థియేట్రికల్ అనుభూతిని అందించడానికి ప్రతి విషయంలో జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కలిసి భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో "మాస్ జాతర" తెలుగు సినీ ప్రపంచానికి మరపురాని అనుభూతిని ఇస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఇక ఇంతకు ముందు విడుదల చేసిన ప్రీ-లుక్ లో రెండు సిగరెట్లు పట్టుకున్న రవితేజ లుక్ సినిమాపై అంచనాలను పెంచింది. "మాస్ జాతర" సినిమా నిజంగా మాస్ ప్రేక్షకులకు, రవితేజ అభిమానులకు మరపురాని జాతరగా నిలిచిపోతుందనే నమ్మకంతో చిత్ర బృందం ఉంది. ఇక త్వరలోనే సినిమాకు సంబంధించిన టీజర్ పై క్లారిటీ ఇవ్వనున్నారు.

## సమంత.. ట్రెడిషనల్ లుక్‌కు ఫ్యాన్స్ ఫిదా



స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో తన కొత్త లుక్ తో మెరిసిపోయింది. దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొంటూ తన అందమైన ట్రెడిషనల్ లుక్ తో ఫొటోలు పోస్ట్ చేసి, ఫ్యాన్స్ ను ఫిదా చేసింది. ఈ సీజన్ లో అందరికీ శుభాకాంక్షలు చెబుతూ.. ప్రతి రోజు ఒక సంబరంలా గడుపుదామని కోరుకుంటూ ఒక సందేశాన్ని పంచుకుంది. సమంత ఈ ఫొటోలను సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బర్వారాలో తీసింది. ఆమె కుర్తాలో అందంగా ఆకట్టుకునే విధంగా కనిపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆమె దీపం వెలిగిస్తోన్న ఫొటోను పోస్ట్ చేసింది. దీంతో పాటు పూజా మందిరంలో దేవుడికి హారతి అందజేస్తూ మరొక ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోల్లో సమంత అందంతో పాటు భక్తి భావనతో కూడిన హావభావాలతో తన అభిమానులను అలరించింది. ఆమె ఫొటోలు మాత్రమే కాకుండా, వేదిక కూడా చాలా అందంగా ఉంది. పూలతో అలంకరించిన రంగోలి, ప్రాచీన శిల్ప కళాకృతులతో ఉన్న దేవాలయం అందరి మనసులను ఆకర్షించింది. ఇది చూసిన తర్వాత నెటిజన్లు ఆమెకు ప్రశంసలు కురిపిస్తూ లైకుల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ లో పలు వెబ్ సిరీస్ లలో సమంత నటిస్తుండటం తెలిసిందే. 'సిటాడెల్' అనే యాక్షన్ డ్రామా తో నవంబర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఆమె ఒక హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ సిరీస్ లో యువరాణి పాత్రలో కనిపించనుంది. అయితే ఈ ట్రెడిషనల్ లుక్ లో ఆమె మరింత అందంగా కనిపిస్తూ.. హార్ట్ విన్నింగ్ ఎక్స్ ప్రెషన్స్ తో ఫ్యాన్స్ కు ఫెస్టివ్ ట్రీట్ ఇచ్చినట్లు చెప్పవచ్చు. కేవలం సినిమాలతోనే కాకుండా డిజిటల్ స్పేస్ లో కూడా సమంత తన సత్తా చాటుతోంది. కానీ ఆమె తెలుగులో కూడా మరో మంచి సినిమా చేయాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## రాశీ గేమ్ ప్లాన్ మార్చేసిందేమిటీ?


ఏబీపీ నెట్‌వర్క్ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో నటి రాశి ఖన్నా IAS అధికారి కావాలనే కోరిక ఉన్నా కానీ, తాను సినిమాల్లో విజయవంతమైన వ్యక్తిగా మారడం వెనక తన ఊహించని ప్రయాణం ఉందని తెలిపింది. తన కెరీర్ మార్పును వివరిస్తూ... రాశి ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరమైన జీవితాన్నికోరుకున్నానని తెలిపింది. అయితే చివరికి నటన తనను పిలిచిందని వ్యాఖ్యానించింది. నా విజయానికి విధి, స్థిరమైన ఎంపికలే కారణమని తెలిపింది. తదుపరి ది సబర్మతి రిపోర్ట్ గురించి ప్రశ్నించగా...మూవీ గురించి ఎక్కువ



వెల్లడించకూడదని నిర్ణయించుకుంది. ఆమె కెరీర్‌లో కీలకమైన చిత్రంగా భావిస్తోంది. దీనికి కారణం .. ప్రభావవంతమైన సామాజిక సమస్యలను పరిష్కరించడానికి ఊహించిన ప్రాజెక్ట్ ఇది. రాశీ ఇటీవల తెలుగు, తమిళం, హిందీలో ఆదరణ పొందిన సినిమాల్లో నటించింది. రాజ్ అండ్ డీకే వెబ్ సిరీస్ ఫర్జీలోను కీలక పాత్రను పోషించింది. మునుముందు మరిన్ని వెబ్ సిరీస్ లకు సంతకాలు చేయనుందని తెలుస్తోంది. తెలుసు కదా.. అగాథియా లాంటి చిత్రాల్లో ను నటిస్తోంది.

## చిరుత బ్యూటీ స్టన్నింగ్ దీవాళి లుక్ చూసారా?

'చిరుత' సినిమాతో టాలీవుడ్ లో తెరంగేట్రం చేసిన నేహాశర్మ ఆ తరవాత సౌత్ లో కనిపించలేదు. కేవలం హిందీ చిత్రాల్లో నటించింది. ఇటీవల శర్మాగాళ్ కెరీర్ ఇటీవల అంతంత మాత్రమే. గత లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అవుతోందని ప్రచారమైంది. తన తండ్రి, కాంగ్రెస్ నాయకుడు దీనిని ధృవీకరించినా నేహాశర్మ కేవలం పార్టీ ప్రచారానికే పరిమితమైంది. అదంతా గతం అనుకుంటే, ఈరోజు దీపావళి సందర్భంగా నేహా శర్మ కొత్త లుక్ లో కనిపించింది. పూర్తిగా రెడ్ కలర్ డిజైనర్ దుస్తుల్లో నేహా శర్మ ఎంతో



సాంప్రదాయబద్ధంగా కనిపించింది. రెడ్ లో నేహా ఎంతో అందంగా ఒద్దికగా కనిపించింది. ఎరుపు రంగు మఖమల్ డిజైనర్ గౌనులో నేహాశర్మ స్టన్నింగ్ అప్పియరెన్స్ తో మైమరిపించిందనే చెప్పాలి. ప్రస్తుతం శర్మా గాళ్ స్టిల్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. నేహా ఫుల్ కిక్కిస్తోందంటూ ఫ్యాన్స్ దీనిపై కామెంట్లు చేస్తున్నారు. చిరుత సీక్వెల్ చేస్తే తిరిగి టాలీవుడ్ కి వస్తుందా? అంటూ చరణ్ అభిమానులు వెర్రిగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతానికి నేహా శర్మ హిందీ పరిశ్రమలో ఓటీటీ ఆఫర్లకు ప్రాధాన్యతనిస్తోందని తెలిసింది.



# భారాస పదేళ్లలో చేయలేని అభివృద్ధిని.. 10 నెలల్లో చేశాం

హైదరాబాద్: తెలంగాణలో పదేళ్ల పాలనలో భారాస చేయలేని అభివృద్ధిని.. తాము పది నెలల కాలంలో చేశామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు రూ. 6.68 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, తమ బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. రూ. 13 కోట్లతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షలతో పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల 5వేల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.



# కళాకారులతో దీపావళి వేడుకల్లో పాల్గొన్న రాహుల్ గాంధీ..

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన మేనల్లుడు రేహాన్ వాద్రా కళాకారుల వద్దకు వెళ్లి వారితో కలిసి దీపావళి నిర్వహించుకున్నారు. వారితో పాటుగా ప్రమిదలు, కుండలు తయారు చేశారు. అంతే కాకుండా వారితో కలిసి ఓ నివాసానికి రంగులు వేసి వారి వద్ద పెయింటింగ్‌లో మెలకువలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పంచుకుంటూ "భారతదేశాన్ని ప్రకాశవంతం చేసే వారితో దీపావళి" అంటూ రాసుకొచ్చారు. "ఈ కళాకారులు తయారు చేసే మట్టి ప్రమిదలు ఎప్పటికైనా ప్రపంచంలోని విలువైన సెరామిక్‌తో చేసిన వస్తువులతో పోటీ పడొచ్చు'' అని రాహుల్ తన మేనల్లుడు రేహాన్‌కు చెప్పారు.

ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను వివరించారు. ఈ కార్మికులు ప్రతి ఒక్కరి దీపావళిని సంతోషకరమైనదిగా చేస్తారని.. ఈ పండగ వీరందరి జీవితాల్లో శ్రేయస్సు, పురోగతి, అభివృద్ధిని తీసుకొస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.




# తెలుగు రాష్ట్రాల పోలీసులకు అవార్డులు

దిల్లీ: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ ఏడాదికి గానూ 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' అవార్డులను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బందికి ఈ అవార్డులను అందజేయనుంది. దేశవ్యాప్తంగా 463 మంది పోలీసు సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా అస్సాం, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలు, దిల్లీ, జమ్మూకశ్మీర్, చండీగఢ్ తదితర కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పోలీసులు, సీఆర్పీఎఫ్, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్సీపీ, ఐటీబీపీ వంటి కేంద్ర సాయుధ బలగాల సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు ఎస్పీలు, తెలంగాణ నుంచి ఒక ఎస్పీతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసు కానిస్టేబుళ్లకు ఈ పురస్కారాలు దక్కాయి.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. రహదారులపై వరదతో ట్రాఫిక్ తిప్పలు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొండాపూర్, మియాపూర్, లింగంపల్లి, కేపీహెచ్‌బీ, మూసాపేట, నిజాంపేట, మాదాపూర్, మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, గండి మైసమ్మ, మల్లంపేట్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్‌పాస్ కింద వరదనీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వస్తున్న వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ వైపు మళ్లించారు. రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



## కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందంటూ మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. పంటల కొనుగోళ్లు, బోనస్‌పై 'ఎక్స్' వేదికగా స్పందించారు. లాభసాటి వ్యవసాయమని, అన్ని పంటలకు బోనస్ అని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులను మోసగించిందని ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోలేని దుస్థితికి రేవంత్‌రెడ్డి సర్కార్ రైతును దిగజార్చిందని మండిపడ్డారు. బోనస్.. బోగస్ అయ్యిందని ఆక్షేపించారు. కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొని... రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# కులం పేరు తప్పుగా నమోదు చేయిస్తే క్రిమినల్ చర్యలు

కరీంనగర్: కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ హెచ్చరించారు. కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంగర్‌లో నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నిరంజన్ మాట్లాడారు. "జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నామని ఇప్పటిదాకా చెప్పుకొంటున్నాం. అది నిరూపించుకునేందుకు ఈ సర్వే కీలకం. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా మా దృష్టికి వచ్చిన విషయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. కులగణన జరుగుతున్న సమయంలో కుల సంఘాలు కీలక పాత్ర పోషించాలి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదు. న్యాయస్థానం పట్ల గౌరవం ఉంది. కోర్టు సూచించినట్టే ముందుకు వెళ్తాం. న్యాయనిపుణల సలహా మేరకు ఈనెల 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగిస్తాం. ప్రజాభిప్రాయ సేకరణలో చాలా రకాల విజ్ఞప్తులు వస్తున్నాయి. కొన్ని కులాల పేర్లు ఎప్పుడూ విననివి కూడా మా దృష్టికి వస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా అందరు సహకరించాలి. అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి" అని నిరంజన్ తెలిపారు.

# కాంగ్రెస్ గ్యారంటీలపై ఖర్గే వ్యాఖ్యలు.. స్పందించిన కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ ప్రజలను నయవంచన చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌ను మించి గ్యారంటీలు ఇవ్వొద్దని.. అలా చేస్తే దివాళా తీసే పరిస్థితి వస్తుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. "గాలిమాటల గ్యారంటీలిస్తే మొదటికే మోసం వస్తుందని ఇప్పుడు అర్థమైందా? కర్ణాటకలో 5 గ్యారంటీలు ప్రకటించినప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ గుర్తుకు రాలేదా? బడ్జెట్ చూసుకోకుండా హామీలిస్తే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తప్పదని ఇప్పుడు బోధపడిందా మీకు. ఆరు గ్యారంటీలతో వల వేసినప్పుడు తెలంగాణ బడ్జెట్ గురించి మీకు తెలియదా. తెలంగాణలో కాంగ్రెస్ ఈ తప్పు చేస్తున్నప్పుడు ఈ విషయాలు ఎందుకు గుర్తుకురాలేదు. కేవలం అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ ఆడిన గ్యారంటీల గారడీతో తెలంగాణ రాష్ట్రం ఏడాదిలోనే ఆగమైంది. పదేళ్లపాటు ప్రగతి పథంలో పరుగులు పెట్టిన తెలంగాణను అడ్డగోలు హామీలతో ఆగం చేశారని అంగీకరించాలి. అనాలోచితంగా కాంగ్రెస్ ఇచ్చే గ్యారంటీలతో భవిష్యత్ తరాలకు కూడా నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషం. కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మిన పాపానికి ఏడాదికాలంగా తెలంగాణకు జరిగిన నష్టం పూడ్చలేనిది. గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన మోసం క్షమించలేనిది" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డైట్, కాస్మొటిక్ ఛార్జీల పెంపు.. 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి : మంత్రి సీతక్క

హైదరాబాద్: ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మొటిక్ ఛార్జీలను 40 శాతం పెంచడంపై సీతక్క సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఛార్జీల పెంపుదలతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందని మంత్రి చెప్పారు. విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లు, హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. భారాస ప్రభుత్వం ఏడేళ్ల క్రితం కొద్దిపాటి డైట్ ఛార్జీలు పెంచి.. భారీగా ప్రచారం చేసుకుందని విమర్శించారు. భారాస పాలనలో విద్యా శాఖ నాశనమైందని, పదేళ్లు అధికారంలో ఉండి కూడా కనీసం టాయిలెట్లు, తాగు నీటి వంటి మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపించారు. అందుకే పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు.



# బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైంది: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి




హైదరాబాద్: కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కరీంనగర్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణకు రాలేదని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బహిరంగ విచారణలో ఆయనతో పాటు భారాస నేతలు నిరసన తెలిపారు. కమిషన్ మీద కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేనందునే ఎవరూ రాలేదన్నారు. "బీసీ కమిషన్‌కు విలువ లేదని హైకోర్టు చెప్పింది. దాని మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వచ్చాం. కానీ మాకు మాట్లాడటానికి సమయం కూడా ఇవ్వలేదు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరాం. భారాస తప్ప ఇతర పార్టీల నుంచి ఎవరూ రాలేదు. కాంగ్రెస్, భాజపా నేతలు ఎందుకు రాలేదు? కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పిన తర్వాత అభిప్రాయ సేకరణ ఎందుకు?" అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

# ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరైన రాజ్ పాకాల



హైదరాబాద్ : జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. విదేశీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి వద్ద కొనుగోలు చేశారనే అంశాలపై ప్రధానంగా విచారిస్తున్నట్టు సమాచారం. బుధవారం రాజ్ పాకాలను 7గంటలకు పైగా మోకిల పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం విడిచిపెట్టారు. బీఎన్ఎస్ఎస్ 35 (3) సెక్షన్ కింద మరోసారి పిలిస్తే విచారణకు రావాలని పోలీసులు సూచించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఎక్సైజ్ పోలీసుల ఎదుట రాజ్ పాకాల విచారణకు హాజరయ్యారు.

# తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలు స్వీకరించిన ఎస్పీఎఫ్



హైదరాబాద్: తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) స్వీకరించింది. ఎస్పీఎఫ్‌నకు చెందిన 214 మంది ఈ రోజు నుంచి సచివాలయం భద్రత బాధ్యతలు చేపట్టారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను ఎస్పీఎఫ్‌నకు ప్రభుత్వం అప్పగించింది. ఎస్పీఎఫ్ కమాండెంట్ దేవీదాస్ నేతృత్వంలో భద్రత సిబ్బంది ఇవాళ సచివాలయం ఆవరణలో పూజలు నిర్వహించి బాధ్యతలను స్వీకరించారు. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్పీఎఫ్ భద్రత నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రత నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్పీఎఫ్‌నకు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదించారు. డీజీపీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం భద్రత బాధ్యతలను టీజీఎస్పీ నుంచి తీసుకోవాలని ఎస్పీఎఫ్‌ను ఆదేశించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com